# ఆంధ్రభూమి

S.D. RAO

2



ఫిబ్రవరి, 1942.

విడిసంచిక 2 అణాలు.

సంపుటం : ౧౦. వృష, మాఖము : ఫిబ్రవరి, 1942. సంచిక : ౪.

# కాంగ్రెస్ ఆంధ్రులలో క్విస్లింగ్ తత్వము

ఆంధ్రరాష్ట్రసిద్ధికి టార్పెడో ప్రాయులైన శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచార్యులవారు రాయలసీమ సంచారం ప్రారంభించారు.

రాజగోపాలాచార్యులవారు కాంగ్రెస్ కూటములో దక్షిణాపథాని కంతటికీ తామే నాయకాగ్రేసరులమనే అభిప్రాయాన్ని లోగడ కలిగించి వున్నారు.

ఆ అభిప్రాయాన్ని మరింత బాగా పాదుకొల్పడానికే ఆ తమిళ మూర్తి తెనుగు మాగాణిలో ఒక భాగమైన రాయలసీమ సంచారానికి పూనుకున్నాడు.

కాలకర్మవశంచేత ఆంధ్రులలో సర్కారు ఆంధ్రులని, రాయలసీమ ఆంధ్రులని విభేదాలు ఏర్పడ్డాయి. హిందూ, ముస్లిమ్ తగాదాలను గోరంతలు కొండంతలు చేసి బ్రిటీష్ బురాక్రసీవారు వ్యవహరిస్తూ వున్నట్లే ఈ సర్కారు, రాయలసీమ విభేదాలను కాంగ్రెస్ బురాక్రసీకి చెందిన రాజగోపాలాచారి ప్రభృతులు పెంపొందిస్తున్నారు.

చిత్రమేమిటంటే ఈ విషయంలో రాజగోపాలాచార్యులవారికి పక్కతాళము వేసే ఆంధ్రాక్విస్లింగుల హంగు కొంత కుదరడం.

స్వార్థంకోసం ఆంధ్ర వ్యక్తిత్వాన్ని చంపుకునే గోపాలరెడ్డి, కాశీశ్వరరావుగార్లు ఆచార్యులవారికి అన్ని విషయాల్లో అడియోస్ అంటున్నారు.

ఆంధ్రులలో కొందరికి ఈగుణం చిరకాలంగా వుండబట్టే కాంగ్రెస్ రాజకీయాల్లో ఆంధ్రుల ప్రతిభ రాణించకుండావుంది.

ఇట్లు కాంగ్రెస్ పెద్దలమనుకునే ఆంధ్రులు కొందరు అనుక్షణమూ రాజాజీ చంకలో దూరుతూ వుండడంచేత మదరాసుకోస్తాలో అరవలతోబాటు ఆంధ్రులకుకూడా నేనే ప్రతినిధిని అనే రాజాజీ మాటకు కాంగ్రెస్‌లో చెలామణీ కలుగుతూవుంది.

అతనిమాటకు చెలామణీకలుగుతూవుంది కాబట్టే కాంగ్రెస్ కార్యకారిణీ సంఘంలో దక్షిణాపథాని కంతటికీ కలిపి రాజాజీఒక్కడే ప్రతినిధి అవుతున్నాడు. మన పట్టాభికి దయాధర్మభిక్షంకింద ప్రత్యేకాహ్వానపుగౌరవం పడుతూవుంది.

నేటికి నాటికి రాజాజీ చంకలో దూరుతూవుండే ఆంధ్రకాంగ్రెస్ గోత్రీకులు రెడ్డి, రావుప్రభృతులచేతనే ఈస్థితికి వచ్చాం.

తమిళుడైన రాజాజీ నీడని తాము వర్ధిల్లడంకోసమని రెడ్డి, రావులు ఆంధ్రజాతికి ద్రోహం చేస్తున్నారు.

ఆంధ్రులైన రెడ్డి, రావుల పక్కహంగులేకుండా ఆంధ్రభాగమైన రాయలసీమలో రాజాజీ ఒంటరిగా సంచరించవలసివస్తే ఆంధ్రేతరులకు ఆంధ్రైక్యము ఎంతగా అవగతమయ్యేది?

కాని కాంగ్రెస్ ఆంధ్రులలో క్విస్లింగ్‌తత్వము వేరుపారింది. మన విరోధుల పాచికలు మన దేశంలోనే బాగాపారుతున్నాయి. ఇంకా పారుతాయి.

ఈ స్థితిలో ఆంధ్రుడికి మోక్షం గగనకుసుమమే.

# నాటకాల్లో ఆంధ్రత్వం

'ఆంధ్రుల మహోజ్జ్వల చరిత్రను, ఆంధ్రుల నిత్య జీవితములోని ప్రత్యేకతను కథావస్తువుగా తీసుకొని విజ్ఞాన వినోదాలకు అనుగుణ్యంగా చిత్రించి రంగస్థలంమీద ప్రదర్శించినచో ఆంధ్ర రంగస్థలం అభివృద్ధి నొందగలదు.'

## కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్. యమ్. ఇ

ఇప్పుడు మనదేశంలో నాటకముల ప్రాముఖ్యము తగ్గినది కీయ వాతావరణమువల్లను, సినీ అనక తప్పదు. మాయుగ ప్రారంభంవల్లను నాట ఏజాతి అభివృద్ధి కావాలన్నా ఆజాతిలో నాటకములు అభివృద్ధి కావలసిందే. రంగస్థలం సన్నగిలిందంటే ఆజాతి నాగరికత సన్నగిలిన దన్నమాట. రంగస్థలమనేది జాతీయ జీవితంయొక్క ప్రతిబింబం.

పడిపోయిన ఏజాతి అయినా పునరుద్దీపితం కావాలంటే ఆ జాతి యొక్క రంగస్థలం పెంపొందాలి. అప్పుడే ప్రజల్లో పీరత్వం పెంపొందడానికి అవకాశం ఏర్పడుతుంది.

రసవంతమైన నాటకములు ప్రదర్శించినచో ప్రజానీకానికి ఉపయోగపడుతాయి.

విజ్ఞానం, వినోదము కలిగించే నాటకాలు సాధారణంగా శుభాం

తాలుగా వుంటాయి.

శృంగారం ప్రధానంగా వున్న నాటకాలలో సర్వసాధారణంగా మూడు సూత్రాలున్నాయి. శుభాంతంగావుండే నాటకాలు చాలావరకు ఈ సూత్రాలను అనుసరించే వుంటున్నాయి.

నాయికా నాయకుల ప్రథమ సమాగమము. వారి ఎడబాటు, వియోగబాధ, తుదకు కలయిక, ఆనందాబ్ధిలో నోలలాడుట, వారితోపాటు ప్రేక్షకులుకూడా ఆనందమనుభవించుట జరుగుతోంది. దీనికి ఉదాహరణ॥ సత్యభామ గర్వభంగము, చిత్రనళీయం మొదలయినవి.

సంఘంలోవుండే పినాసి వ్యక్తుల భావచిత్రనవల్ల ప్రజల కానందం కలిగించడం మరిఒకరకపు నాటక విధానం.

ధనాశచే కురూపిణైన పిల్లనైనా పెండ్లిచేసుకోవడమో, కట్నాల ఆశచే కుమారుని ఉద్దేశము కనుక్కోకండానైనా తాంబూలాలు పుచ్చుకోవడమో చేసి తుదకు అధనం నిరుపయోగమని పశ్చాత్తాప తప్తులుకావడం. ఇత్యాది ఘట్టాల్ని చిత్రించే నాటకాలన్నీ ఈరకపువి.

మూడోరకం. కాంతా కనకములపైనుండు ఆశచే మానవులు చేయు అత్యాచారాలు నిరూపించేవి. హాత్యలు విషాదాంతములైనా ఈ రకపు నాటకాల్ని మానవులు ఆనందించడం కద్దు.

నేటికాలంలో విషాదాంత నాటకములు వేనవేలు మనం చూస్తూనేవున్నాం. అందులో రంగూన్ రౌడి పేర్కొనతగివుందని నా అభిప్రాయం.

నాటకములు వినోదానికేకాక విజ్ఞానప్రచారానికి కూడా బాగా ఉపయోగపడతాయి. ఆంధ్రనాటక రంగస్థలం పెంపొందడానికి ఆంధ్రజాతీయ జీవితాన్ని నిరూపించే నాటకాలే కరవైపోయాయి-

ఆంధ్రుల మహోద్యమాల చరిత్రను, ఆంధ్రుల నిత్యజీవితములోని ప్రత్యేకతను కథావస్తువుగా తీసుకొని విజ్ఞాన వినోదాలకు అనుగుణ్యంగాచిత్రించి రంగస్థలంమీద ప్రదర్శించినచో ఆంధ్రరంగస్థలం అభివృద్ధి పొందగలదని నా విశ్వాసము-

ఇప్పటివరకు తెనుగునాట ఆడే నాటకాలు చాలావరకు అనుకరణంలో, లేక పురాణగాధలో అయివున్నాయి- కాని ఆంధ్రజాతీయత వెదజల్లేవిగా లేవని చెప్పక తీరదు-

ఇప్పు డిప్పుడు ఒకటి రెండు సంఘాలు ఆంధ్రుల చరిత్రను పరిశోధించి నాటకములు వ్రాసుకొని ఆడుతున్నాయి అందులో సామర్లకోట వాణీ నాట్యమండలి, బందరులోని డి.వి. సుబ్బారావుగారి నాట్యమండలి పేర్కొనదగినవి.

మదరాసువంటి మహానగరంలో ఆంధ్ర నాట్యకళా కేంద్రమును స్థాపించి- ఆంధ్ర విజ్ఞానాన్ని వెదజల్లేటట్లు మంచినాటకముల వ్రాయించి ఆడించడం వాంఛనీయం-

ఆంధ్రనాట్య కళాపరిషత్తువారు ఇందు విషయమై శ్రద్ధవహిస్తారని నమ్ముతున్నాను.

## విజ్ఞాన విషయాలు

యూరప్‌లోని స్విఫ్టు అనే జాతి పక్షి ఒక్కొక్కప్పుడు గంటకు 200 మైళ్ళదూరంవరకు ఎగరగలదు.

... ... ...

సీసాలకు మూతలుగా మనం ఉపయోగించే కార్కు చాలా తేలికయినది. ఒక పౌను తూకంగల కార్కు దుంగ మీద మానవుడు నీటిలో సునాయాసంగా తేలగలడు.

... ... ...

ఇంగ్లండులో వివిధ జంతు ప్రదర్శనశాలల్లో 150 సింహాలు బోనులలో బంధితాలయి వున్నాయని అంచనా వేయబడింది. లండన్‌లోని జంతు ప్రదర్శనశాలలో 23 సింహాలు వున్నాయి. అశాలలో 12 సింహాలకే అదిలో చోటు ఏర్పాటైవుండినది.

... ... ...

పుష్టికరమైన ఆహారాలలో వెన్న ముఖ్యమైనది. ఒక పౌను వెన్న 3600 కాలొరీలను ఈయగలుగుతుంది.

... ... ...

గోడలకు కొట్టేప్పుడు సున్నంలో పలచటి సరేసు, పటికనీళ్ళుపోస్తే వెల్లకు మంచి కాంతివచ్చి గోడలకు బాగా అంటుకుని చాలారోజులు వుంటుంది.

... ... ...

బట్టలమీది సెత్తురు మరకల్ని పోగొట్టడానికి వానిని ఉప్పుకలిసిన చన్నీటిలో వుతకాలి.

# ద్రోహానికి తగ్గ ఫలం

[భారతదేశ చరిత్రలోని ఒకానొక ఉద్రేక ఘట్టపు ఇతి వృత్తాన్ని ప్రస్తరించే ఏకాంకిక.]

రచయిత:

నీలకంఠం గురుస్వామి

౧

[కాబూలుదేశపు పరిసరప్రాంతంలో— బాబర్- రహస్యాలోచనామందిరం. పాలగచ్చుతో నిగనిగ లాడుతూ వుంటుంది.

ఉన్నత ఆసనంమీద బాబర్ కూర్చుని వుంటాడు, ఎక్కువ పలచగా- పొడుగ్గా వుంటాడు. చిన్నగడ్డం, ఆజానుబాహులు, ముఖం గంభీరంగా వుంటుంది.-

జాఫర్ ఖాన్: బాబర్ యొక్క- అంతరంగిక మిత్రుడు. రాజనీతి కుశలుడు. సాధారణపు దుస్తులు ధరించి, మాటలతో యిట్టే ఆకర్షించుకోగల ముఖంతో- ఒప్పారుతూ నిలుచుని వుంటాడు.

సిసోది. మేవాడురాజ్య - రాజనీతి తత్పరుడు. కోరమీసం- ముఖంలో గంభీరత- పౌరుషం- వుట్టిపడుతూ వుంటుంది. మొలదట్టీలో, కైజారు, గజము పొడుగు కత్తి వ్రేలాడుతూంటాయ్. బాబర్ కు దగ్గరగా కూర్చునివుంటారు.]

* * *

బాబర్—సిసోదీ! బాగా ఆలోచించు!

సిసోది—[ఎర్రటి నేత్రాలతో] క్షమించండి! మీరు పొరపడుతున్నారు...!

జాఫర్—కాదు! గొప్ప ఐశ్వర్యాన్ని కాలితో, తన్ని- చెడిపోతున్నారు. మీ భావిపరిస్థితిని...

బాబర్—పిచ్చివాడా! ఒకరి బాగు కోరి నీజీవితాన్ని పాడుచేసుకుంటావా...? నీవు లేకపోతే,- నీ ఆలుబిడ్డలగతి యెవరు చూస్తారు...? వారిని ఎవరు పోషిస్తారు? పోషించినా- యెంత కాలం?

సిసోది—ఆలు బిడ్డలకొరకు- నా మేవాడుతల్లిని- శత్రువులచేతిలో పెట్టలేను. మహారాజా! యీ సిసోది బొందిలో ప్రాణముండగా- నాతల్లిని- పరహస్తగతం కానీయను...

జాఫర్—తల్లి...! యెక్కడితల్లి! బాగుంది. నీవు మలమల మాడుతూ వుంటే- నీతల్లి, కనికరించి పట్టెడు మెతుకులన్నా పెడుతుందా ... రాజ్యమనేది ఒకరిచేతుల్లో- సుస్థిరంగా వుండదు. అది చేతుల్లోంచి, చేతుల్లోకి మారుతూవుంటుంది. దాన్ని మాకు అప్పగించు. నీ వుపకారం వృథాగనే పోనీయము.

సిసోది—[కత్తిమీద చెయి వేసి] అప్పగించాలా! రాజపుత్రులకు, జన్మభూమియందున్న - అభిమానం- మానప్రాణములం గూడా వుండదని తెలుసుకోండి! సెలవు...[లేస్తాడు]

బాబర్—[ఆసనంమీదనుంచి లేస్తూ] సిసోదీ? మాట...ఆగు..

[వెళుతూన్న సిసోది ఆగుతాడు.]

బాబర్—[సిసోది చేతులుపట్టుకొని] కోపంవచ్చిందా...? మామా! [అనునయంగా] రాజ్యం వీరభోజ్యం! మరిచిపోయావా...? మేవాడుకు- యివాళ సంగరాణా రాజు... రేపు నీవే ఆరాణాస్థానంలో వుంటావేమో...! యెవరు చెప్పగలరు. అంతా కాలంలో యిమిడి వుంది.

సిసోది—[ఆశ్చర్యంగా] నేనా...! రాణాగానా...? వట్టిది...

బాబర్—అవును! యెలా కాదంటావ్...? యెవరి జీవితసౌభాగ్య సుఖాలన్నా ఆ కాల

గర్భంలో దాక్కొని వుంటాయ్! రోజులు గడిచినకొద్దీ- ప్రపంచం...యెలా మారిపోతుందో...అలానే, మానవుడికి మంచిరోజు వచ్చేసరికి ... దానంతటదే అదే... మనదగ్గరకు వస్తుంది. కానీ,- నీళ్ళలో మునిగిపోతూన్న మానవుడు - బైటకురావాలని యెలా ప్రయత్నిస్తాడో- అలానే- తన జీవిత మధురక్షణాలకోసం- ప్రతి మానవుడు ప్రయత్నించాలి. మానవప్రయత్నం అందుకనే!

సిసోది—రాజా! యెందుకు? ఆశాప్రపూరితంగా మాటలు చెప్తావ్...? నాకు అంత అదృష్టం లేదు...రాదుకూడాను...!

బాబర్—సంగరాణాతో- సమమయినవీరుడవు. నీకు సంక్రమించని దేముంది? [జాఫర్ వేపుచూచి] జాఫర్...! నీవు వెళ్ళి నా యేకాంతమందిరంలోవుండు. యిప్పుడే వస్తాను. [జాఫర్ వెళ్తాడు] సిసోది! రా...తీరిగ్గా...ఆతోటలో మాట్లాడుకుందాం...

[యిద్దరూ నడుస్తూ.]

బాబర్—[నడుస్తూ] సిసోదీ! మీ రాజపుత్రజాతి - పౌరుషం - త్యాగం...వర్ణించడానికి యే కవుల కలమూ పనికిరాదు. అందులో మీరాణా అస్త్రవిద్యానైపుణ్యం- బలం. అబ్బ...చెప్తుంటేనే కంపరం పుట్టుంది. కానీ- రాణాకు తెలివి

## స్వప్నగత వస్తువులు

లంగరు—

కలలో లంగరు కనిపిస్తే స్త్రీలకు పెళ్లి అవుతుంది; పురుషులకు సముద్ర ప్రయాణం తగులుతుంది.

గాలము—

చేపలకోసం గాలం వేసినట్లు కలవస్తే ఆపద రానున్నదన్నమాట.

చీమలు—

కలలో చీమలు కనిపిస్తే నీవు సుఖవంతుడవై ఒక పెద్ద పట్టణంలో జీవిస్తూ అనుకూలవతి ఐన భార్యను పొంది మంచి సంతానాన్ని పడసి తృప్తుడ వవుతావు.

వస్త్రం—

కట్టుకున్న వస్త్రం పోగొట్టుకున్నట్లు కలవస్తే నీగుణాన్ని ఇతరులు పాడు చేస్తారు.

కట్లపాము—

కట్లపాము కలలో కనిపిస్తే భాగ్యమూ, ధనవంతురాలయినా భార్యా దొరుకుతాయి.

—పిచ్చిన మ్మ శాలు

---

తేటలు యెక్కడా వున్నట్లు కనబడడం లేదు ? మూలవిరాటువి ...నీవుండగా అతనికి యేమాత్రం భయంలేదు...

[తోటలో- పాలగచ్చుతో చేయబడిన రాతిబెంచిమీద- యిద్దరూ కూర్చుంటారు.]

సిసోది—యింతకూ మీరుచెప్పేది బోధపడడంలా లేదు !

బాబర్— [చిన్నగా నవ్వుతూ] గ్రహించలా నాభావాన్ని! అవును! అమాయకుడివి! యేమి తెలుస్తుంది? అందుకే. రాణా - రాజనీతితత్వజ్ఞుడనే బిరుదిచ్చి—నీతో, తనపనుల్ని కొనసాగేట్లు చేసుకుంటున్నాడు. పనికిరాని- గౌరవ బహుమానాలతో- నిన్ను మోసం చేస్తున్నాడు. రాజ్యమేలగలిగిన శౌర్యధురంధరుడవైన, నీతో- యీ విధంగా. యెందుకూ పనికిరాని- హీనమైన పనులు చేయిస్తున్నారు. నివురుగప్పిన నీ అస్త్రవిన్యాసాన్ని- నాకు జాఫర్ తెలియచేసాడు, నీవు సంగరాణాకంటే, పౌరుష వంతుడివి.

సిసోది—అవును! నాలో అంతశక్తి వుంది. కానీ! యేలుబడి చేసేందుకు రాజ్యం...!

బాబర్—రాజ్యమా...! అయితే నీకు రాజు కావాలనే వాంఛ వుందా...?

సిసోది—[ఆలోచించి, తలూపుతాడు]

బాబర్—అయితే ఒక్కమాట వింటావ్...?

సిసోది—చెప్పండీ...చూతాం..!

బాబర్—నేను నిన్ను రాణాగా చేస్తాను.

సిసోది—[నవ్వుతూ] యీ తోటకా...?

బాబర్—కాదు...మేవాడుకు.

సిసోది— [ఆశ్చర్యంతో] మేవాడకా...! నన్నా...! రాజుగానా! మరి సంగరాణా...?

బాబర్— అతన్ని పదవీభ్రష్టుని చేసి...

సిసోది—వద్దు...రాజా... వద్దు...ఆమాట అనకు..., నాకు యెందుకో భయమేస్తూవుంది.

బాబర్— హిందూవంశంలో పుట్టిన- వీరపురుషులకు భయమా...? పిచ్చివాడా...! నీ మేలు కోరి చెప్తూన్నా...! రాణాగా- యీవిశాల విశ్వంలో- నీపేరు ప్రతిధ్వనించాలంటే- నీ విజయదుంధుభులు- దిక్కు దిక్కుల పిక్కటిల్లేట్టు మ్రోగాలంటే- నీ పౌరుష - గుణాలు, కీర్తిచషకాలంటే,- నాకు ఒక్క వుపకారంచేయి. దానితో నీవు రాణా వవుతావ్. నీలో యెక్కడో అణగి తొంగిచూస్తున్న పిరికిశక్తికి లోబడిపోయి- యీ రాణాపదవి త్రోసివేసినా- యీవిశాలభారతభూమి- తనదేశాలకి- తనంతట తాను- నిన్ను రాణాగా స్వీకరిస్తుంది ... ఆకళలు- నీ ముఖంమీద నాట్యమాడుతున్నై! యెందుకీ కష్టం...? ప్రయత్నించు. నీ జీవితంతో పాటు రాజ్యంకూడా, సునాయాసంగా లభిస్తుంది...!

సిసోది— [సంశయిస్తూ] యేమిటా వుపకారం...?

# అప్పు

ఒకరికి అప్పు ఈయవద్దు. ఒకరివద్ద అప్పు తేవద్దు. ఏమంటే అప్పు అన్నది తాను పోవడమేకాకుండా స్నేహితుణ్ణి కూడా పోగొడుతుంది. అప్పు పుచ్చుకోవడంవల్ల పొడిమియొక్క అంచులు మొద్దుబారిపోతాయి.

—*Shakespeare*

---

బాబర్—మీ మేవాడును జయించే- సులువైనమార్గం...

సిసోది—[ఆలోచించి] చెపితే! రాజ్యం బహుమానం ...! [తలూపి] సరే...! [కంగారుగా] వద్దు ... నేను చెప్పలేను...

బాబర్—ఆలోచించు సిసోదీ! వస్తానంటున్న నిధిని తోసి, పశ్చాత్తాపపడి- ప్రయోజనం.!

సిసోది—[శూన్యాకాశంలోకి చూస్తూ] సరే! బహుమానం...!

బాబర్—రాణాసంగుని పదవీభ్రష్టతతో- సిసోదినీ రాణాగా చేయడం...చాలునా...?

[చిరునవ్వు, నవ్వుతూ సిసోది- బాబర్ చెవిలో- యేదో- గుస- గుస లాడుతాడు. బాబర్ తన చిన్నగడ్డాన్ని సవరించుకుంటూ నవ్వుతాడు.]

౨

[రాణా 'సిసోది' ప్రత్యేకమందిరం- సింహాసనంమీద కూర్చుని వుంటాడు. ద్వారపాలకుడువచ్చి, జోహారుచేసి]

ప్రభూ! బయట- బాబర్ మహారాజు...తమకోసం...

రాణాసిసోది— [ఆశ్చర్యంగా] యెవరూ...? బాబరా...! బాబర్. వెళ్లు...! కాదు...! పద నేనే వస్తాను...!

[బాబరును చూచి, సిసోది జోహారు చేసి, తీసికొనివచ్చి, ఒక వున్నతాసనం మీద కూర్చోపెడతాడు.]

బాబర్— [గడ్డం సవరించుకుంటూ] సిసోదీ! మీరాణా మృతుడయ్యాడా! పాపం! మహావీరుడు యెంతలో ఆయువు ముగిసింది.

సిసోది—అవును! ప్రభూ, అందరూ అంతేగా!

బాబర్—నిజమే! యెవరికి చావు యెప్పుడురాసివుందో అప్పుడు చస్తారు. యెవరికి తెలుస్తుంది యీవిషయం?- రేపు- నేనూ అంతం కావలసిందే! యివాళ నీవు- అస్తమిస్తావేమో, యెవరు చెప్పగలరు?

సిసోది—అవును, ప్రభూ! లోకంలోని ప్రతి విషయమూ అంతే!

బాబర్—కాదూ మరి, మేవాడుకు, నిన్నటి చక్రవర్తి యివాళ లేడు. యెవరు యేం చేస్తారు?

సిసోది—అంతే! అంతే-! [నిట్టూరుస్తాడు.]

బాబర్—సిసోదీ! యీ సంతోష సమయంలోకూడా- అలావుండడం—నాకేమీ, బాగోలేదు- ఒకరి జయాపజయాలకు-మనం

బాధ్యులమూ...?

సిసోదీ—అవును ప్రభూ! యేనో. యింతకూ- తమ అండ-

బాబర్—యేముందిలే — సంగరాణా విషయంలో - మొదటి నుంచీ నాకు అదోవిధమైన కోపం—నా శత్రువును...

సిసోదీ—అవును! [తలూపుతాడు]

బాబర్—శత్రుపీడ వదిలిపోయింది...వస్తాను!

సిసోదీ—అప్పుడేనా, ప్రభూ?

బాబర్—(లేస్తూ) సిసోదీ! చాలాసేపయింది వచ్చి, వెళ్ళొస్తాను !

సిసోదీ—ప్రభూ! దాసుని మర్చిపోవద్దు—!

బాబరు— మర్చిపోవడమే ! (వీడ్కోలు యిచ్చేందుకు ఒకరిని ఒకరు కౌగలించుకొంటారు. బాబర్, విషచ్ఛురికతో, సిసోదీ హృదయంలో గ్రుచ్చుతాడు)

సిసోదీ— (కౌగలినుంచి తప్పుకొని) అబ్బ ? విషచ్ఛురిక— (రక్తం కారుతూ వుంటుంది) బాబర్ ! (కత్తితీయబోయి- తలతిరిగి క్రిందపడి) ఛీ! చండాలుడా, యెంత నమ్మకద్రోహివిరా! కిరాతుడా! యవనరాక్షసులకు దయ అనేది లేదు ? ప్రభూ! సంగరాణా! క్షమించు. పాపిని- క్షమించు- నిన్ను నమ్మించి శత్రువులకు అప్పగించాను. ప్రతిఫలం అనుభవిస్తున్నా- దుష్టుణ్ణి - క్షమించు (ఆయాసం యెక్కువౌతుంది) అబ్బ...క్ష...మా... మేవాడు. త...ల్లీ...క్షమా! బా...బ...ర్...కృత...ఘ్న. ఛా...తు...డా! (పండ్లు కొరుకుతూ ప్రాణాలు విడుస్తాడు)

బాబరు— (పడిపోయిన సిసోదీ, శరీరాన్ని, ఒక్క తాపు తన్ని) చండాలుడా! ఛీ! నీప్రభువున్న చోటికి— ప్రతిఫలం పొందావ్, కుక్కా !

[అంతఃపురంవైపు వెళతాడు.]

లోకసత్యాలు: ౧.

# తెలంగాణాలో తెలుగు సోదరులు

రచయిత :

భావరాజు నరసింహారావు

[సాయంత్రం 5-30 గంటలకు: హైదరాబాదులో రెసిడెన్సీరోడ్డుమీద. విదేశీసూటు, టోపీధరించి సుబ్బారావు, పల్నాడు ఖద్దరు దుస్తుల్లో శాస్త్రి, శర్మ నడుస్తూంటారు. రోడ్డుమీద వాళ్ళకు ఎదురుపడ్డవాళ్ళలో సుబ్బారావును ఎరిగినవాళ్లు—'సలాం, సారాబ్ రావ్‌జీ' అంటూ— శాస్త్రి, శర్మలను ఎగాదిగా చూసి పోతూంటారు. రోడ్లకూడలి దగ్గర నుంచున్న పోలీసు కనుచూపు మేరదూరం వరకూ శాస్త్రి, శర్మలను అనుమానంతో చూసి, చూసి 'ఏ సి ఐ.డి. సోదరుడో వీళ్ళసంగతి కనుక్కోక పోతాడా?' అనే ఆశతో ఆచూపు మరల్చుకుంటూంటాడు. శాస్త్రి, శర్మ, రావులు యీవిషయాలన్నీ గమనిస్తూనే, తమలో తాము మెల్లిగా మాట్లాడుకుంటూ సాగిపోతూవుంటారు.

ఇంతలో ఒక బట్టలషాపుముందు ఒక కారు ఆగుతుంది. అందులోంచి సుర్వా, షెర్వాణీ, కుచ్చుటోపీ, చడావులు ధరించిన ఒక ఎర్రని, సన్నని పురుషుడు దిగి దుకాణంలోకి వెళ్తాడు]

రావు.—శాస్త్రీ! ఆమనిషిని చూశావూ? ...గుర్తించావా?

శాస్త్రి:—ఆ! చూశాగానీ యిది వరకు చూసిన మొహంకాదే?

రావు:—శర్మా! నువ్వూఅంతేనా?

శర్మ:—ఆహా! (మళ్ళీ దుకాణం ముందు ఆగి, ఆవ్యక్తిని తిరిగీ చూసి) మనఊళ్లో పోలీసు డిప్యూటీ సూపరింటెండెంటుగా ఉన్న సాహెబు తమ్ముడు కావచ్చు—పోలిక అల్లాగేఉంది.

రావు:—గొంపటేశావు! ఆయన స్వచ్ఛమైన వైష్ణవుడు—ఆహితాగ్నుల వంశంలోవాడు! మనమంతా చాలాసార్లు చూశామాయన్ను కచాళేశ్వర అగ్రహారంలో.

శాస్త్రి:—కచాళేశ్వర అగ్రహారంలో చూశామా! బ్రాహ్మడా!...అసలు మనం చూడడంమాట అల్లాఉంచు, ఆఅగ్రహారంలో యిల్లాటి బ్రాహ్మణ్ణి అయ్యంగార్లు కాపరం చేయనిస్తారూ?

రావు:—అక్కడ కాపరం చేసినప్పుడు ఇల్లాఉండేవాడుకాదు, అక్కడెల్లా ఉండాలో అల్లాగే ఉండేవాడు—శుభ్రంగా గండభేరుండంచు పంచా, బిళ్ళగోచీ, నల్లకోటూ, జరీ తలపాగా, తీర్చి దిద్దిన నామాలూ—అన్నీ యథావిధిగానే ఉండేవి.

శాస్త్రి:—మరి యిదేంవేషం యిప్పుడు? అసలు ఏయింట్లో ఉండేవాడీయన?

రావు:—ఆ అగ్రహారంలో మన రామారావున్న యింట్లోనే అద్దెకుండేవాడు యీ ప్లీడరు. ఈయన మామగారు మా ఆఫీసు ఛీఫ్ అకౌంటెంటు—రామానుజ అయ్యంగారు. ఈయనకు మద్రాసులో బొత్తుగా కిట్టకపోవటంచేత మెల్లిగా హైద్రాబాదు పట్టించాడు, క్రిందటి సంవత్సరం. ఇప్పుడిక్కడ ఆబ్కారీ డిపార్టుమెంటులో అసిస్టెంటు అకౌంటెంటుగా ఉంటున్నాడు—నెలకు జీతం నూటయాభై కాకుండా, పైన కావలసినంత సంపాయిస్తున్నాడు.

శాస్త్రి:—ఇంతకూ ఆవేషం ఎందుకో చెప్పావుకావు.

రావు:—అదా — 'ఉదరపోషణార్థం బహుకృతవేషం,'

శాస్త్రి:—ఏం! ఆవేషం వేయని వాళ్ళంతా ఉదరపోషణ చేసుకోవటంలేదూ?

రావు:—ఆ! చేసుకుంటున్నారు నాలాగానే—పదిహేనేళ్లు పని చేసిం తర్వాత అరవైరూపాయల జీతంతో!

శర్మ:—ఆవేషం వేస్తేనే అంత లాభం ఉంటే, అంతకంటే... శుభ్రంగా ఆమాటమే పుచ్చుకోకూడదూ నువ్వు?

శాస్త్రి:—అంతదూరమెందుకు...హాయిగా తిరపతి కొండ మొదట్లో కూచుంటే జీవనం శుభ్రంగా వెళ్ళమారదో!

రావు:—ఇదేనోయ్ మనవాళ్ళ వేదాంతం. ఏఎండ కాగొడుగు పట్టి, ఆమూణ్ణాళ్ళూ ఎల్లాగో ముక్కు మూసుకుంటే తర్వాత హాయిగా—మనయిష్టం వచ్చినట్లు—ఉండకూడదూ! చేస్తే శుద్ధ క్షౌరమేకాని...యింకేవీ పనికిరావయ్య... ఆ అయ్యంగార్ని చూశారుగా, యింట్లో ఎల్లా ఏడుస్తాడో తెలియదు గాని, బయటికొచ్చినప్పుడు మాత్రం పక్కా తురకవేషం! ఈ ఉద్యోగంలో ఉన్న పదేళ్లూ అల్లా గడిపేస్తాడు. పాతిక వేలు మూటకట్టుకుని తర్వాత శుభ్రంగా పట్టెవర్ధనాలు దిద్ది, పార్థసారథిగుళ్ళో ప్రాయశ్చిత్తం చేయించుకుంటాడు—దాసుడి తప్పులు దండంతో సరి!

శాస్త్రి:—మరి యింత ఉపన్యాసం కొట్టినవాడివి నువ్వు ఊరుకున్నావేం కుచ్చుటోపీ తగల్చకుండా?

రావు:—అవన్నీ ఆ అరవ్వాళ్ళకే సరిపోయాయి. ఉద్యోగాలూ, డబ్బూ సంపాయించటానికి ఏ పనైనా, ఎంత కష్టపడైనా చేయగలరు వాళ్లు, అంతేగాని మనం ఆపనులు చెయ్యలేము, కష్టపడనూ లేము...అసలు ఈ సప్తకట్ల వేషమే విధిలేక లేక వేస్తున్నాను. ఇక్కడి సాయబులు 'సుబ్బారావు' అనకుండా 'సోరాబ్ రావ్' అని పిలిచినా, గుడ్లనీరు గుడ్లలో కుక్కుకుని 'ఆఁ' అంటున్నాను. పిల్లలకో తెలుగు చెప్పకుండా, బళ్లో తురకం చెప్పుంటే! చేసేదిలేక 'వాళ్ళ ఖర్మ' మనుకుని సరిపుచ్చుకున్నాను...

శాస్త్రి:—ఇహ చాల్లే గొడవ... (నవ్వుతూ) మీ అవ్వ తురకమంగలికే తల ఒప్పచెప్పింది గావల్ను కష్టమనుకోకుండా? మీ...(నవ్వుతూంటాడు)

శర్మ:—శాస్త్రీ! ఇంకా హాస్యమాడుతున్నావూ వాణ్ణిచూసి—వాడి దురవస్థకు బావురుమని ఏడవకుండా! మనమంతా యిల్లా 'మనకేం!' అని ఊరుకోబట్టే, మన తెలుగువాళ్ళంతా యిక్కడబ్రతకలేక మతం మార్చుకుంటున్నారు. ఒక్కసారి సరిగ్గా కళ్లు తెరిచిచూడు—పది సంవత్సరాల కింద యీరాజ్యంలో ఉన్న హిందువులలో ఎంతమంది యిప్పుడు మతం మార్చుకున్నారో! వేషం మార్చుకోవటంతో వచ్చేలాభం తాత్కాలికం, మతం మార్చుకుంటే వచ్చేలాభం శాశ్వతం—వంశపారంపర్యం!

రావు:—మన ఆంధ్రదేశంలో శాశ్వతోద్యోగాలకోసం ఎంతమంది క్రైస్తవులు కాలేదు యిదివరకు?

శర్మ:—అదే చెప్తున్నా, క్రైస్తవులు పాలించేచోట వాళ్ళల్లో కలిస్తేనేగాని లాభించలేదు. ఇప్పుడు, యిక్కడ కూడా ఆసూత్రమే!

రావు:—ఆసంగతి అల్లా ఉంచు. అటువంటి పెద్ద ఆశలు లేని వాళ్లు యిక్కడపడే యిబ్బందులు భగవంతుడికి తెలియాలి.

శాస్త్రి:—నిజంగా అన్నిబాధలున్నాయా యిక్కడ!

శర్మ:—శాస్త్రీ! నిన్నమనాలో నాకు తెలియకుండా ఉంది... నిన్నేకాదు...మన ఆంధ్రదేశంలో ఎంతోమంది నీలాగే ఉన్నారు యీ విషయంలో. అసలు మనవాళ్ళకి హైదరాబాదు రాజ్యంలో తెలుగుజిల్లాలున్నాయనీ, తెలుగువాళ్ళంటూ ఉన్నారనీ, వాళ్లు యమయాతన అనుభవిస్తున్నారనీ

స్పృహే లేదు! 'ఆంధ్రరాష్ట్రం ఆరు నెలల్లో రాకపోతే చూసుకోండి...' అని ఉత్తరకుమార ప్రతిజ్ఞలు చేసేవారేగాని, 'ఆంధ్రరాష్ట్రం వచ్చేలోగా మన యిల్లు చక్కబెట్టుకుందాం, మనవాళ్ళందర్నీ ఒకచోట కూడతీద్దాం, వాళ్ళ కష్ట నష్టాలు విచారిద్దాం, తర్వాత మిగతా విషయాలు అఘోరిద్దా' మన్నమాటే లేదు మన నాయకులకూ, అనుచరులకూ కూడా!

రావు:—ఇంకెందుకూ, యిల్లాగే యింకా పదేళ్ళపాటు జరిగిపోయిందంటే, యీరాజ్యంలో తెలుగు మాట్లాడుకునే యోగ్యతకూడా ఉండదు సరికదా, తెలుగువాడు తెలుగువాడుగా జీవించడు.

శాస్త్రి:—శర్మా! అయిందేదో అయింది కాని, యిహనుంచీ యీరాజ్యమంతా తిరిగి మనవాళ్ళ యోగక్షేమాలన్నీ విచారిద్దాం.

శర్మ:—తప్పకుండా చేద్దాం. ఐతే అంతటితో మనపని పూర్తి కాదు, ఇక్కడి వీళ్ళ అవస్థలు మనం జీర్ణంచేసుకుని, అక్కడి మనవాళ్ళందరికీ మన తెలంగాణా సోదరుల అష్టకష్టాలూ అర్థమయ్యేటట్లు ప్రచారం చేయాలి. వాళ్ళంతా వెతుక్కుంటూవచ్చి వీళ్ళందరికీ చేతనైన సహాయం చేసేటట్లు చేయాలి.

రావు:—శర్మా! ఈ ఉత్సాహం కార్యరూపంచెందినప్పుడే దాని సార్థకత. నీబోటివాళ్లు ఊరికి పదిమంది చొప్పున పట్టుదలతో యీపనిచేస్తే తెలుగుతల్లి కడుపు ఫలించినట్లే.

శాస్త్రి:—మన అరవ సోదరుల్ని చూశైనా నేర్చుకోవాలి యిల్లాంటి విషయాలు, మనం.

శర్మ:— వాళ్ళ లోపాలనుచూసి వెక్కిరించటం చాతనయినంత బాగా, వాళ్ళ మంచి మనకు పట్టుబడదుగా! అదే మనవాళ్లకున్న జాడ్యం.

రావు:—శాస్త్రీ! ఇహ యింటికి పోదాం.

[శాస్త్రి, శర్మ, రావులు తిరుగు మొహం పెట్టేసరికి, ఎదురుగా ఒక మహమ్మదీయసోదరుడు వచ్చి శాస్త్రి, శర్మలను వారి స్వగ్రామం, వృత్తి, హైదరాబాదుకు వచ్చినపని, ఎవరింటికొచ్చింది, ఎంతకాలం ఉంటేదీ వారి నడిగి ఒక నోటుబుక్కులో వ్రాసుకుని వెళ్తాడు. వాళ్లుముగ్గురూ ఒకరిమొహం ఒకరు చూసుకుని ఊరుకుంటారు.]

# పిచ్చి నమ్మకాలు

## కసింద చెట్టు

తమ సూర్యదైవతానికి కసింద చెట్టు ప్రియమైనదని ఈజిప్షియన్ల నమ్మకం.

## మందుగ్లాసు

రోగికి ఇవ్వడానికి ఉద్దిష్టమైన మందుగ్లాసు ప్రమాదవశాత్తూ బోర్లాపడితే అతడు త్వరలో రోగవిముక్తుడవుతాడని జపానీయుల నమ్మకం.

## వ్యభిచారము

తాము వనాలలో హారతి కర్పూరం కోసం వెతుకుతూ వుండగా ఇంటివద్ద తమ భార్యలు వ్యభిచరిస్తే తాము కూర్చే హారతికర్పూరం హరించిపోతుందని సారవాక్ ఆదిమజాతీయుల నమ్మకం.

వ్యభిచారదోషం గుర్తింపబడకపోతే గ్రామాల్లో అంటుజాడ్యాలు విజృంభిస్తాయి అని వంగదేశంలో రాజమహల్ చెంతగల కొండలలో నివశించే వారి విశ్వాసం.

## కుక్క

కుక్క ప్రసవమైన తరవాతపడే మావిని కుక్కలు తింటే వాటికి పిచ్చి పడుతుంది.

## వయస్సు

తన వయస్సును తానే చెప్పుకోవడం వల్ల ఆయుక్షీణమవుతుంది (ఇండియాలో).

ఒక స్త్రీ వయస్సు తెలుసుకోవాలనివుంటే ఆమె తలమీది వెంట్రుక ఒకటి తీసుకో. దానికి ఒక ఉంగరం కట్టు. దానిని ఒక చెంబులో ఆ చెంబు అంచులకు తగలకుండా వేలాడకట్టు. ఆ వుంగరం వూగడానికి ఆరంభిస్తుంది. ఆ వెంట్రుక యజమానురాలుకి ఎన్ని సంవత్సరాలు వున్నాయో అవుంగరం అన్ని సారులు ఆ చెంబు పక్కల్ని కొడుతుంది. (బ్రిటన్‌లో.)

## కుందేలు

కుందేలు కాలియొక్క చీలమండ ఎముకలు కనిపిడ వదిలించుకోడానికి ఉపయోగకరాలని అరబ్బులు.

## చీమలు

చీమలు అతి కంగారుగా పాకిపోతూవుంటే గాలివాన వస్తుంది. (మలయా)

చీమలు నిద్రపోవు (ఎమర్సన్)

మీ గుమ్మందగ్గర చీమలపుట్ట పెట్టడం ధనం రావడానికి సూచన (లీన్)

## సీమరేగు

ఆకురాలు కాలంలో సీమరేగు చెట్టు పూస్తే పెళ్ళి జరగబోతున్నదని (లోయిర్ సాగ్జనీ).

కొత్తగా కాపుపట్టిన సీమరేగు చెట్టు మొదటికాయను కడుపార కంపెడు పిల్లల్నికనిన స్త్రీ కోసితిన్నదంటే ఆ చెట్టు ఏటేట బాగా కాస్తుంది (బొహిమియా)

## చేయి

మోచేతికి దిగువ చేతిమీద వెంట్రుకలు బాగా దట్టంగావుంటే ఆ పురుషుడు భాగ్యవంతుడవుతాడు. (ఓహియో)

## బూడిద

కాలేకొరకొయ్యనుంచి గదిలో బూడిదరాలితే ఆపదలు వస్తాయి (గ్రీస్).

ఒకమనిషి చనిపోయిన పదోనాడు అశవాన్ని తగలపెట్టినవాడు కొంత బూడిద జల్లించి ఒకచోటపోసి దానిమీద బుట్టబోర్లిస్తాడు. దగ్గరలో ఒక దీపం వుంచుతాడు. మరనాడు ఆబూడిద పరీక్షించి దానిమీద ఏజంతువు ఆకారం వుంటే ఆజంతువుయొక్క రూపాన్ని మృతుడు పొందుతాడని నమ్ముతాడు. (వంగదేశం)

## గాడిద

జీసస్ క్రైస్తు గాడిదమీద ఎక్కి జెరూసలమ్‌లో ప్రవేశించాడు.

గాడిదమీద క్రాస్ మార్కు వుంటుంది.

గాడిదమీద క్రాసుమార్కుగల ప్రదేశాన్నుండి తీసిన మూడు వెంట్రుకలు కోరింతదగ్గును మాన్పుతాయి. కాని వెంట్రుకలు పీకబడ్డ గాడిదమాత్రం చనిపోతుంది.

ఆడ గాడిద పెత్తురు మూర్ఛరోగాన్ని పోగొడుతుంది.

## గొడ్డలి

వసంతఋతువులో ఓంప్రథమంలో బయటికి పోయ్యేటప్పుడు పశువులు గొడ్డలిదాటితే వానికి చేతబడి దోషం వుండదు.

# మణిమాల

## నిమ్మపండ్లు

నిమ్మపండ్లు మనుజులకు ఆరోగ్యమును సమకూర్చే పండ్లన్నిటిలోను చాలా శ్రేష్ఠమైనవి. మనుజులకు వచ్చు సాధారణ వ్యాధులు- అంటే, మలబద్ధకం, అజీర్ణము మొదలగు వ్యాధుల బారినుండి,- ఏ డాక్టర్ సహాయము లేకనే యీ నిమ్మపండ్ల సేవనవలన తప్పించుకోవచ్చు.

### గుణములు

పండ్లయందు, పొటాషియం, క్యాల్సియం, మ్యగ్నీషియం, ఫాస్ఫరసు, మాలిక్ యాసిడ్ మొదలగు అమూల్య పదార్థములు- తగు మాత్రంగా ఎ. బి. సి. విటమిన్‌లు (జీవాణువులు) ఉన్నాయి.

అందు—

పొటాషియం ఉండుటవలన —రక్తమును శుభ్రపర్చి, కండరముల నభివృద్ధి పర్చును. నరములకును, మెదడునకును బలమును, ఆలోచనాశక్తిని ఇచ్చును.

క్యాల్సియం ఉండుటవలన—దంత వ్యాధులను రానీయక, దంతములకు మంచి పటుత్వము నిచ్చును. ఎముకలకు బలమును కల్గజేసి, కష్టసహాన శక్తిని ఎక్కువ చేయును.

మ్యగ్నీషియం ఉండుటవలన — పండ్లకు పగును ఇచ్చును. శరీరములో అసంఖ్యాకములైన కణములను జనింపజేసి, ఆరోగ్య రక్షణమునకు తోడ్పడును. మలబద్ధకమును పోగొట్టును.

ఫాస్ఫరసు ఉండుటవలన— ఊపిరితిత్తులను పరిశుభ్రపరచి, సరిగా పని చేయునట్లు చేయును. కఫమునుహరించి, ఉబ్బసము, దగ్గు, క్షయ మొదలగు వ్యాధులను శాంతింప జేయును.

మాలిక్ యాసిడ్ ఉండుటవలన— తామర, గజ్జి, మొదలగు చర్మవ్యాధులను పోగొట్టును.

ఎ. బి. సి. విటమిన్లు వుండుటచే చిక్కిన శరీరమును బలపర్చి శరీరమును పెరగనిచ్చును. రక్తమును చెరుపుచేయు పదార్థములను బయటికి త్రోసివేయును. అంటురోగముల నంటనివ్వక చర్మమును తళతళ మెరయునట్లుంచును. ఆకలిని వృద్ధిచేయించును. అతిసారము, కాళ్లు-చేతులువాచుట, ఇగుళ్ళనుండి గక్తము స్రవించుట మొదలగు వ్యాధుల బారినుండి రక్షించును. శరీరమునందలి రక్తమునందుగల చెడుపదార్థములను బయటికి త్రోసివేయును.

చర్మవ్యాధులలో యీనిమ్మతొక్కలను, నారతోగూడవేసి రుద్దిన యెడల హరించును. ముఖమునకు రుద్దిన చర్మమునకు కాంతిని, నరములకు బలమును ఇచ్చును.

నిమ్మరసమును కొబ్బరిపాలలో కలిపి గిలకొట్టిన ఒక విధమైన వెన్నలాంటి పదార్థము వచ్చును. దానిని తలకు రాసి మర్దనచేసిన ఉష్ణమును హరించి, వెంట్రుకలను పెరుగనిచ్చును. చిడుము మొదలగు వ్యాధులను నివారించును. పైదానిలో వెన్నకలిపి ముఖమునకు రాచిన మొదటిరకపు స్నోవలె నుండును. శరీరమునకు రాచిన చర్మములోని మురికి నంతయు బహిర్గత మొనరించును. దీని రసము వేడినీళ్ళలోకలిపి పుక్కిలించిన నోటిలోగల దుర్గంధములు హరించును. ఉదయము, సాయంత్రము నిమ్మరసమును నీళ్ళలో కలిపి త్రాగినయెడల ఆహారనాళమునందలి మాలిన్యమును హరించును. వెచ్చని నీళ్ళలో కలిపి త్రాగిన మలబద్ధకమును పోగొట్టును. నిమ్మకాయతొక్కలను పండ్లకు రుద్దినయెడల పండ్లయందలి మురికిని పోగొట్టి పండ్లకు బలము నిచ్చును. అన్నములో దీని రసము కలుపుకొని తినిన ఆహారము తేలికగా జీర్ణము చేసి, అజీర్ణవ్యాధులను రాకుండ చేయును. ప్రతిదినము దీని రసం త్రాగుచున్న అజీర్ణములు హరించును. కండ్లలో ప్రతిదినం వేస్తూవుంటే, హాయిగా నిద్రపట్టించి, కండ్లవ్యాధుల రాకుండా చేయును. దీని రసము- నువ్వులనూనె మరగనిచ్చి, నొప్పులున్నచోట మర్దింపజేసిన నొప్పులనుతీయును. కలరా మసూచికములు వున్నపుడు నిమ్మపండ్లను యెక్కువగా వాడుచూ, నిమ్మకాయరసం కల్పిన నీటినే త్రాగుతూ వుంటే, కలరా మసూచికములకు భయపడవలసిన అవుసరముండదు.

ఈ నిమ్మపండ్ల రసము పదిసంవత్సరముల వయస్సు కలవారు దినమున కొక చెంచాయున్నూ, ఇరువది సంవత్సరముల వయస్సు కలవారు 2 చెంచాలున్నూ,

ముప్పది సంవత్సరముల వయస్సు గలవారు 3 చెంచాలున్నూ యీరీతిగా హెచ్చించుచూ పోవలెను. అట్లు వాడినవారు నిరంతరయౌవనము లనుభవించుచూ పూర్ణాయుష్మంతులై, వార్ధక్యములో గూడ నరముల పటుత్వముగలిగి వుందురు. సుఖరోగములచే బాధపడువారికి యీనిమ్మపండు అమృతము వంటిది.

—సూర్యప్రభ.

* * *

## ముఖవిన్యాసం

ఆసలు శరీరానికి ముఖం మంచి సౌందర్యస్థానం. మనిషియొక్క సౌందర్యాన్ని చూడాలంటే ముఖంచూస్తే తెలుస్తుంది. ముఖంలో ముల్లోకాల ముద్దులు మురిసిపోతుంటవి. మరీ ముఖానికీ మెరుగుబెట్టునవి ముఖవిన్యాసాలు. మనోగత భావములకు ముఖము విషయసూచిక. ఒక్కొక్కసారి మనోగతభావాలు ముఖంలో వెల్లివిరిసి పోతుంటవి. మనస్సు ఆనందంగావుంటేముఖమానందంగా అగుపడుతుంది. మనస్సుగనక దుఃఖపూరితమై వుంటే ముఖవిన్యాసంగూడ కళావిహీనంగా వుంటుంది. మనస్సు మారుతుంటే అప్రయత్నంగా మనకు తెలియకనే ముఖంగూడ మనస్సు ననుసరిస్తుంది. మానసికసృష్టిలో ఇదీ వక చమత్కారమే.

కొందరి ముఖవిన్యాసాలు ఎప్పుడూ తుమ్మల్లో ప్రొద్దుగూకినట్లుంటవి. ఈ ముఖాలకు మలబద్ధకరోగం జాస్తి. ఎప్పుడు మనస్సు ఏదో సంసారచింతను కలిగివుంటుంది. ఇది తరుచు గొప్పగొప్ప సంస్థాధిపతులలో జాస్తి.

కొన్నిముఖవిన్యాసా లుంటవి: రామరామ! సలసలకాగిన నూనెలో నీళ్లు పోసినట్లు. ఆ ముఖంమీదగనక పిడికెడు వడ్లగింజలేస్తే పెటపెటమంటై. ఈ ముఖాలకు తమ కొంపలలో తమ పెళ్లాలతోటి ఎప్పుడూ చిటపట నవ్వులే. వీరి సంతానం ఈముఖాన్ని జూడగానే రాక్షసుణ్ణిజూచినట్లు భయపడుతుంది. ఇల్లాంటివారి భ్రూమధ్యం తురుచు ముడతలు తడిస్తుంటుంది.

కొన్ని ముఖవిన్యాసాలు నవ్వుతున్నా ఏడ్చినట్లే వుంటై. కాని ఈముఖాల హృదయంమాత్రం అతినిర్మలం. ఇట్లాంటి ప్రకృతులు సృష్టిలో కొంచెంతక్కువ.

కొన్ని ముఖవిన్యాసా లున్నవి. అవి బలే తమాషాజేస్తవి. అవి ఎవరైనా పెద్దమనిషి అగుపడితే తక్షణం బుగ్గలను పైకిలాగి పలువరస అగుపడకుండా పెదవులను పెద్దవిజేసి ముఖాన్ని కొంచెం కిందికొంచి కుశలప్రశ్నలు జేస్తుంటై. ఇవి కొరివి దెయ్యాలమాదిరి అప్పుడు వెలిగి వెంటనే చల్లారుతుంటవి. వీటివల్ల పరుల కుపకారం సున్న.

—దివ్యవాణి.

* * *

## తాంబూలము

తాంబూలము భోజనానంతరము అర్థగంటకు పయిన నూరు అడుగులు నడచిన తర్వాత భక్షణచేయవలయును. ఈ తాంబూలమునకు ముఖ్యముగా గమనించవలసినది. పోక- ఆకు- సున్నము. పోకలలో నందాపురిపోక పైత్యహరముగను, లఘువుగను, కొంచెము మధురముగను, గర్భశోధన చేయునదిగను, విరోచనకారిగను నుండును. ఆంధ్రదేశపు పోక వగరుతోకూడిన రుచి, కఫ, వాతహరమై రక్తజాడ్యమునుహరించును. పడమట సముద్రతీర దేశపు పోక ఉపయోగించిన అజీర్ణము, క్రిమి, వాయువును పుట్టించును. ద్రవిడదేశపు వక్క, ఆకుసహా, మధురముగానే వుండును. వీర్యవర్థనమేకాని, వాయువుచేయును. శ్లేష్మమును వక్క చూనుటకు పలచనగా, పగలు పుప్పిలేకుండా, కత్తిరించిన చేవతేలి వుంటుంది. పచ్చివక్క నములుటచే కంఠశుద్ధి, పైత్యరోగమును, కడుపుపొంగును, ఉదరరోగమును హరించును.

ఎండుపోక కంఠరోగశమనము, రుచికరము ఐ వుండును. అడవిపోక చొంగను, తిక్కను, సంతోషనాశనమును పుట్టించును. మూడు మాసములు పాతబడిన పోకయు, పదిహేనురోజులు ఎండనియ్యక నిలువచేసిన తమలపాకులున్నూ, మూడురోజులు నిలువయున్న సున్నమున్నూ చాలా ప్రశస్తము. ఇటుల చెప్పుటకు కారణము: కస, పస, పొగరు అణగిపోవును. కావుననే పోకలను కత్తిరించి వాడవలయును. లేనిచో పండ్లకు దౌర్బల్యము- కర్ణములకు, శిరస్సుకు కొంతకాలమునకు జబ్బుచేకూర్చును. పోకలలో ఒకవిధమగు పురుగుచేరును. దానిని పోగొట్టుటకై పోకలను, కత్తిరించి వాడవలయును. పోకచెక్కలు కత్తిరించి యగ్రములు లేకుండా కొట్టి పచ్చకర్పూరము, లవంగములు, జాజికాయ, జాపత్రి, కొంచముగా కస్తూరి, కుంకుమపువ్వుచేర్చి పేరిన నేతితో తడిపి, ఆరించి వుపయోగపరచినచో సర్వరోగనాశనమై మనస్సునకు ఉత్సాహమును కలిగించును.

తమలపాకు నోటిబెరడు గట్టుటను, దౌర్గంధ్యమును మొదలగువానిని బోగొట్టి నించుక చేదు, వగరు, వేడిగలిగి నిర్మలమై శ్లేష్మవాతహరమై యుండును. అపుడుగోసిన పసరాకు ముఖరోగము, జాడ్యమును, అరుచిని, మలబద్ధకమును, దాహమును కలిగించును. నల్లనిరంగాకు వేడిచేసి వగరై, జాడ్యకరమై నోరును ఎండించును. తెల్లని పత్రము శ్లేష్మము, వాతములను హరించి రుచిని, సంతోషమును, ఆకలిని కలిగించును. కర్పూరవల్లీయనెడు తమలపాకు మిక్కిలి శ్రేష్ఠమయినది. ఇది రోగులకు యోగ్యమయినది. ఉప్పన, వత్తియనుగలిగి, దీపనము, రుచియు, లఘుతరమై కామోద్దీపన కారియై, వాతకఫహరమై యుండును. తమలపాకులను వాడునపుడు కూడదు. పత్రములు చివరగనిప్పరాదు. పర్ణమూలము వ్యాధిని పుట్టించును. పర్ణాగ్రము, మార్గపర్ణము ఆయుష్యహరము. ఒక పోకయు అయిదు ఆకులు అనపగింజంత సున్నము, అందులో సగము కర్పూరము, మూడు నాలుగు తక్కోలములు, మూడు లవంగములు, పెసరగింజంత జాజికాయయును గలసిన తాంబూలము సకలదోషహరము. దీనిని విద్వాంసులు భక్షింతురు! పోకచెక్కలోని పురుగు గళగండరోగమును, ఆకులయందలి పురుగు ముఖరోగమును, సున్నమందుండురాయి యశ్మరీరోగమును బుట్టించును. తాంబూలము ప్రాతఃకాలమందు సేవించిన వేడిని, రుచిని, అగ్నిమాంద్యమును, వీర్యహానిని, పాండు, మూత్రకృచ్ఛ్ర, ప్రమేహ రోగములను చేయును. ఎక్కువ తాంబూలమును సేవించిన శరీరము తెల్లబడును. దంతపటిమతగ్గును. ఇంచుక నిద్రించిలేచి జలపానముచేసి ఫలాదుల భక్షించి కొంచెముకాలము నిర్మలచిత్తుడైయుండి తాంబూలమును భక్షించవలయును. ద్రవపదార్థ భక్షణానంతరము తాంబూలము శ్రేష్ఠము. పాండురోగము, నేత్రరోగము, రక్తపిత్తము, శోఫ, మూర్ఛ, అతిసారము, మూత్రకృచ్ఛ్రము, ప్రదరము, వమనము, అపస్మారము, దాహరోగము, త్వగ్దోషము కలవారికి, క్షయరోగులకు- పిపాసాతురులకు - క్షీరపానము చేసిన వారికి తాంబూలము అర్హము కాదు.

—జనాన్ రైతు,

* * *

## విచిత్ర వివాహ పద్ధతులు

బిజరా అనే దేశంలో వధూవరుల ప్రేలిరక్తము కొంచెముతీసి, పాయసము లోకలిపి వండి భార్యాభర్తలకు పెట్టెదరు.

చకామా అనే కొండజాతివారిలో ఒకవిధముగు బెంకనువంపి, అరక్షాన్ని వధూవరులు పూసుకొని, ఒకేసారి ఇద్దరూ స్నానము చేసెదరు.

దక్షిణాఫ్రికాకు చెందిన నకూటో జాతివారు యెద్దునుచంపి, కడుపులోని పేగులనుతీసి, భార్యచేతికి ఒకటి, భర్త చేతికి ఒకటి కట్టెదరు.

దక్షిణ అమెరికాలో బ్రెజిల్ అనే దేశంలో స్త్రీలు తాము ఏరికోరిన పురుషునే వివాహమాడుతారు. పెండ్లికూతురు వరుడికి కావలసిన వస్తుసామగ్రి తీసుకొని, అతనిదగ్గరకువెళ్ళి బ్రతిమాలుతుంది. ఆమె బ్రతిమాలుకొద్దీ వరుడు సిగ్గుతో మూలమూలకూ ఒదిగిపోతాడు. ఒదిగిపోయిన వరుడిని వధువుతరపువారు అందరూ పట్టుకొని గదిలో నిర్బంధిస్తారు. అప్పుడు వరుడు ఒప్పుకుంటాడు.

రష్యాలో కాకేసస్ ప్రాంతంలో పెండ్లికొడుకు పెండ్లికూతురు ఇంటికివెళ్లి వివాహము చేసుకోమని అడుగుతాడు. అతను అడిగినకొద్దీ ఆమె వివాహం ఆడనని కోపంతో భీష్మించుకొని కూచుంటుంది. ఇంతలో పెండ్లికొడుకు తరపువారు అందరూవచ్చి, ఆమెను ఎత్తుకొని ఇంటికి తీసుకవెళ్ళి దాచిపెట్టుతారు. వెంటనే పెండ్లికూతురు తరపువారు అందరూవచ్చి ఆమెను దాచినతలుపులను పగులకొట్టేటంత గడబిడచేస్తారు. అంతవరకూ వచ్చిన తరువాత పెండ్లికొడుకు తరపువారు తలుపులుతీసి, విందుకు ఆహ్వానించి, తినుబండారములు ముందు పెడతారు. ఇంతగోల అయినతరువాత జరిగే ఆవిందులో వివాహము పూర్తిఅవుతుంది.

ఫిలిప్పయిన్ దీవులలో లూజాన్ దీవిలో వివాహపద్ధతి మరీ వింతగావుంటుంది. వివాహానికి ముందరగా వంద డానికిపిలైన రెండు చెట్లను దగ్గరగా పాతి, వధూవరులను ఆచెట్లపైకి ఎక్కనుంటారు. పురోహితుడు ఆరెండు చెట్లను దగ్గరగా వంచుతాడు. అంటే, వధూవరులు చాలదగ్గరగా తగిలేంతవరకూ ఉండి ఒకరినొకరు ముద్దు పెట్టుకుంటారు. అదే ఒప్పుదలగా తీసుకొని, చెట్లమీదనుంచి దింపి, వివాహకాండ జరిపిస్తారు.

—ప్రజావాణి

# వివేకానంద

అనిమేషాబ్జవిలోచనల్ మధురగీతాలాప దివ్యైకధో
రణి వింజామర వీవ, ఎందు దివిజారామంబులన్ నీ గురుం
డును, నీవున్ విహరించుచుంటిరో సుఖానూనప్రశాంతాత్ములై ;
అనఘా ! మా నతు లందుకొమ్మవె వివేకానందయోగీశ్వరా !

పలుదేశంబుల కేగి హైందవమత ప్రాశస్త్యమున్ దివ్య భా
షల నుద్ఘోషము చేసి, బ్రహ్మమయ తేజఃపుంజ సమ్మోహితా
ఖిల పాశ్చాత్య విపశ్చిదగ్రణివినై, కీర్తి ప్రభా వల్లరుల్
వెలయన్ పందిరి గట్టినావు దశదిగ్వేలా విశాలంబుగన్.

ఒక చూపుతోనె మృత్యువునైన నదలించు ఆజ్ఞాస్వరూపము లైన కనులు,
సృష్టిస్థితి రహస్య మెల్ల మేదస్సులో నలరుట తెల్పు ఎత్తయిన నుదురు,
అఖిలవేదాంతవిద్యాపాండితీపటిమ నుపన్యసించు సొంపైన పెదవి,
మానవోద్ధరణ సముచిత కార్యభారము వహింపంగ దక్షమగు ఉరము;

కలిగి త్రిజగన్మోహన మోము గ్రాలు దివ్యరూపమున మర్త్యలోకంబు బ్రోచుకొరకు
అవతరించిన యా త్రిగుణాత్మకుడవె ; కాక ఆదివ్యతేజస్సు కలుగు నెట్లు ?
ముక్తికాంతా సమాగమాసక్తి నుండ చూపనట్టి యస్ఖలితతేజుడవు, పరమ
ముని వరుండవు, నిష్కామమూర్తి, వనవరత పరబ్రహ్మతేజోవిరాజితుడవు.

అంతులేని వేదాంతవిద్యార్ణవంబు కలచి, కల్లోలితము చేసి, చెలగి స్వైర
గతి మెలంగితి వొక తిమింగలము మాడ్కి అన్యతార్కిక యాదోభయంకరముగ.

ఒక సుడిగాలివోలె భవ దుజ్జ్వల వాగ్రచనా సమృద్ధి, ఓ
యకలుషమూర్తి! శ్రోతల హృదంతర వీధుల దుమ్ముధూళి చి
మ్ముకొనుచు, రేగి, కమ్ముకొని, వ్యోమముఖంబుగ సందడింప దే
శికుల గురుండె యచ్చెరువుపాటున నిల్చెగదోయి ధీనిధీ !

ఈసమయంబునం దయిన నేమెపుడే చవిపుట్టి నీ యుప
న్యాసములన్ పఠింప — అమృతార్ణవ తుంగ తరంగజాలకో
లాసముపాత్త నిర్జర విలాస వనాంతర సంచరన్మనో
భాసులమై గ్రమించెదము స్వార్థవిచార ధరాంచలంబులన్.

ఒక తొలిపుట్టువందు మహిమోన్నతరూప! భవత్పదాంబుజం
బుకడ త్వదీయసేవయె ప్రమోదకరం బగుచుండ, నీదు ప్రే
మకలిమి నున్న శిష్యపరమాణువు నేమొకొ! ఈభవాన నే
టికిని మదీయ మానసపుటీధ్వను లన్నియు నీ ప్రశంసలే.

— పురాణం కుమార రాఘవ శాస్త్రి

# అనుభవిస్తాడు, కాని...

[ ఒక యథార్థ సంఘటన ]

[ఆమె అంటే అతనికి అనురాగంవుంది. ఆమెను నిరభ్యంతరంగా అనుభవిస్తాడు. కాని తన్ను అర్థాంగిగా స్వీకరించమని ఆమె అడిగితేమాత్రం ఛీ-ఛీ-వస్తుంది. ఇది మగవాని దౌర్జన్యాలలో ఒకటి. —సంపాదకుడు.]

రచయిత:

## కొత్తపల్లి ఇందిరా దేవి

౧

ప్రసాదు యవ్వనం మళ్ళిపోయింది. అతని పాలు పొంగిపొరలి చల్లారిపోయినవనే చెప్పాలి. కాని విధి అతనిని పట్టి పడతోసినది వూబిలో.

అది మధ్యాహ్నసమయం. అప్పుడే అఫుట్ డోరుడ్యూటీనుంచి యింటికివచ్చి భోజనంచేసి గ్రామఫోనుపెట్టుకు శ్రమతీర్చుకుంటున్నాడు హంసతూలికాతల్పంమీద మహారాజులాగున. ఎవరిమంచముమీదవారు మహారాజులేకదా!

ఇంతలో అతని చిన్నకొమరుడు రఘు పరుగు పరుగునవచ్చి 'నాన్నగారూ! టెలిఫోనులో ఎవరో మిమ్ములను పిలుస్తున్నారండీ' అన్నాడు.

ఎవరైవుంటారా అని చరచర లేచి వెళ్లాడు. టెలిఫోను చేత తీసుకొని 'ఎవరండీ?' అన్నాడు అతిశాంతంగా.

'నమస్తే! నేను నారాయణరావుని' అని జబాబు.

'ఓరి! నువ్వట్రా! ఏంసమాచారం? బాగా వున్నావా? ఎప్పుడొచ్చావు వూరునుంచి?' అన్నాడు ప్రసాద్.

'బ్రదర్! నేను యీరోజే వచ్చాను. కాని యీవేళే వెళ్ళిపోతున్నాను. నీతో కొంత అత్యవసర కార్యం ఒకటి మాట్లాడి పోవాలి. నీ బసకి రావడానికి నాకు తీరికలేక ఫోనుచేస్తున్నాను, మరోలా అనుకోక వీలుచేసుకుని మైలాపూరులో నాబసవద్ద కలుసుకోవాలి. ఇది నా ప్రార్థన. తరువాత దేవరచిత్తంనాభాగ్యం' అన్నాడు నారాయణరావు.

ఏదో చిరపరిచితుడు నారాయణరావు పాపం ఏంప్రమాదస్థితిలో వున్నాడో ఒకసారి చూచివద్దామని వెంటనే చొక్కా వేసుకొని మైలాపూరు వెళ్లాడు ప్రసాద్.

౨

నారాయణరావు బసలో అటునిటు తచ్చాడుతున్నాడు. అతని ముఖంలో నెత్తురులేదు. పాలిపోయినట్టువుంది. అతన్ని ఏదో గడ్డు సమస్య ఎదుర్కొన్నట్టు తోచింది. అతనికి ప్రసాదు దర్శనం ఎండిపోయిన చేనుమీద నీరుపెట్టినట్టు అనిపించింది.

'ప్రసాద్! నీకోసమే కాచుకుని వున్నాను. పద బస్సులో మాటాడదాం' అన్నాడు నారాయణరావు.

పూనమల్లిరోడ్డు వెళ్లాలని బస్సు ఎక్కారు. బస్సులోకూడా అతన్ని అంతగా వేదిస్తున్న విషయాన్ని గూర్చి అతడు ప్రస్తావింపలేదు. హృదయభారంచే వూరుకున్నాడేమో శాంతంగా చూదామనుకున్నాడు ప్రసాద్. బస్సు భారత్ మూవిటోన్‌కు ఎదురుగుండా ఆగింది.

'దిగు' అన్నాడు నారాయణరావు. ప్రసాద్ దిగాడు. అక్కడికి

తన్ను ఎందు కతీసుకువచ్చాడో తెలియలేదు. కాని అతనితో మాట్లాడకండా అనుసరిస్తున్నాడు ప్రసాద్. ఇద్దరు లోపలికి వెళ్ళారు.

అక్కడ మేనేజరును దర్శించి నారాయణరావు 'అయ్యా' ఇక్కడ కమల అనే అమ్మాయి వున్నది ఒక్కసారి పిలిపించండి' అన్నాడు.

మొదట ఆమేనేజరు అట్టివ్యక్తి ఎవరూ అక్కడలేదే అన్నాడు.

కాని ఆమె లక్షణాలు అన్నీ వర్ణిస్తే 'ఆహా! ఆమెయా? ఆమె పేరు కమలకాదే సరళ అంటారే!' అన్నాడు.

అంటూనే ఆమెను బయటకు పిలిపించాడు.

అదే మొదటి సందర్శనం ప్రసాదుకి, కమలకును. ఒకరినొకరు క్రీగంట చూచుకొన్నారు. నారాయణరావు కమలతో చాలాసేపు మాటాడి ఆమె కష్టసుఖాలు కనుక్కొని వెళ్ళిపోయే సమయాన ప్రసాద్‌కి ఆమెను పరిచయం చేశాడు.

## ౩

ఒకనాడు కమల స్వయంగా ప్రసాదుయింటికి వచ్చేసింది. 'నీట ముంచినను పాలముంచినను మీదే భారం. నాకింకెవరూ లే' రని ఆ బేల బేలగా పలికింది. కాంత కన్నీటికి కరుగని మానవ హృదయం వుండదు. అందులోను కామోద్రిక్తుడైనవాడా? తనంతట తాను వచ్చి తనపాదములమీద పడిన కమలను కాలదన్నలేక పోయాడు ప్రసాద్. అతనిలో నివురు కప్పివున్న కామాగ్ని ప్రజ్వరిల్లినది.

కమల రూపవతి, గుణవతి, అంతకు మించిన విద్యావతి. తల్లి భ్రష్టురాలవ్వటంవల్ల సంఘంలో ఆమెకు గౌరవం లేకపోయింది. కాగా సినిమాలో చేరి తారగా కీర్తి గణించాలనుకుంది. ఆమె రూపలావణ్యములకు ముగ్ధులై ఆమెను అన్నివిధాలా ఉపయోగించుకోవాలనుకున్నారు సినిమా నిర్మాతలు. ఆమె మానధనాన్ని దోచుకోవాలని చూస్తున్న సినిమా నిర్మాతలబారి నుండి రక్షించమని కోరింది కమల.

కాగా ఆమెకు ప్రత్యేకంగా ఇల్లు ఒకటి చూచి అందులో వుండమని తనకుతోచిన ధనసహాయం చేశాడు ప్రసాద్. ఆపరిచయం ముదిరి ఆమెతో సరససల్లాపాల్లోకి దిగింది. తుదకు ప్రణయమాధుర్యంలో నోలలాడ మొదలు పెట్టాడు. స్వర్గ సౌఖ్య మనుభవించాడు. కమల తన బహిఃప్రాణంగా తలచాడు. ఆమెను తన ప్రణయదేవతగా పూజించాడు. ఆమెనువిడనాడి ఒక్క నిముసమైనా వుండలేకపోయేడు.

ఆమెను ఇంతగా ప్రేమించి కామించినా ఆమెను ఒక వెలయాలిగాను, ధనముకొరకు మానమును విక్రయించుకొను నికృష్టజీవిగాను చూచేవాడే కాని ఆదమరచి హృదయమును పూర్తిగా ఆమెఅధీనం చేయలేదు. తన సంసారిక సాంఘిక జీవనాలకు ఆమె అడ్డురాకూడదని అతని మతము.

స్త్రీకి మానముకన్న మహత్తర వస్తువేది? మానరక్షకుడు భర్త. కాగా ప్రతిస్త్రీ భర్తకై అన్వేషిస్తుంది. తగిన భర్త దొరికితే అతనికి తన సర్వస్వము వశం చేస్తుంది.

దరిద్రసాగరంలో అంతూ దరిలేక ఈదులాడే తనకు ప్రసాదుని ప్రసాదించాడు కదా భగవంతుడని కమలం మురిసిపోయింది. అతనిని భర్తగా పొందాలని వాంఛించింది. అతని ప్రణయం స్థిరమని వూహించి మురిసిపోయింది. నారాయణరావు చేతిలో పొందిన పరాభవంకూడా ఆమెకు గుణపాఠం కాలేదు.

# నవ్వు

నవ్వు కేవల హాస్యరస సంబంధియనుటకు వీలులేదు.

అది యీ ప్రపంచములో బహు కారణ జన్యమును, భిన్న కార్య జనకమును గూడ నగుచున్నది.

విద్వేష వ్యంజకమగు విషపు నవ్వు-ఆత్మార్జవానంద సూచకమగు నమాయికపు నవ్వు—వెడవిల్తు వికారముల వ్యక్తీకరించు వింతనవ్వు—పరిహాసద్యోతకమగు వంకరనవ్వు—బ్రహ్మకైనఁ గారణము బహులుపలుక వశముగాని వాతులాలయము దారినవ్వు—

ఇట్టి వెన్నియో రకముల నవ్వు లున్నవి.

—కూచి నరసింహము

ప్రసాదునకు అయాచితంగా లభించిన ఆ అబలారత్నంమీద ఆశ మెండు. ఆమె బాహులతలలో బంధింపబడి ఆమె అధరామృతం ఆస్వాదించు సమయాన తను ఇంద్రుడో, చంద్రుడో, ఉపేంద్రుడో ఐవుండాలని మురిసిపోతాడు. కాని ఆమెను తన భార్యగా పరిగణించడానికి భయపడతాడు. పాడు సంఘానికి వెఱచి ఆప్రణయవృత్తాన్ని అతడు కూకటివ్రేళ్ళతో కూలదోసుకోవలసి వచ్చింది.

౪

కమల రూపురేఖలు అనేకమంది కాముకులను ఆకర్షించాయి.

కిలకిలలాడే ఆ కమలముఖముఖకమలంలోని అధరామృతము నకై కాముకులలో పోరాటము చెలరేగింది. సంఘందృష్టిలో కమల ఒక వ్యక్తి, వస్తువుకాకపోవడమే దీనికి కారణమేమో!

అంటే స్త్రీకివ్యక్తిత్వము లేదని– ఆమె తనదీ అనిపించుకోడానికి వెరచిన ప్రసాదుకూడా ఆమెను జారవిడవడానికి ఇయ్యకొనలేదు.

చిరపరిచితుని మోమాటంవల్ల పరిచయభాగ్యం పడసి తుదకు ఆమెవలలో తగుల్కొని తేనెలో పడ్డ ఈగలా ప్రసాదు బయటకు రాలేక పోయాడు,

ఉద్యోగగర్వంచే అందుబాటులోనికి వచ్చిన స్త్రీరత్నములను చెరబట్టే ఒక పెద్దమనిషి ప్రసాదుపైన హుంకరించాడు. ప్రసాదు వెలమబిడ్డ. ఆకడజాతివాని బెదిరింపులకు తల వొగ్గి భీతిచెంది అతని హృదయకమలమగు కమలను విడనాడలేదు.

ఆమె అతనిని పెనవేసుకుపోయినప్పుడల్లా పెండ్లి చేసుకోమని అదే పనిగా ప్రాధేయపడితే అతనిబుద్ధి తిరిగిపోయింది. ఆమె పెండ్లిచేసుకోమని అడిగినప్పుడల్లా అతనికి జమాజెట్టీల్లావున్న తనకుమారులు, ప్రాచీన తంగేడు లావుండే తన భార్యా అతనిదృక్పథంలో గోచరించేవారు ఆమెను వివాహం చేసుకోడానికి అతనికి ధైర్యం చాలేది కాదు.

మృత్యుదేవత గుమ్మంలో కాచుకునివున్నా మానవుడు రేపటి సంగతి ఆలోచిస్తూ వుంటాడు. అది మానవసహజం. అలాటప్పుడు యవ్వనంలోవున్న కమల తనభావిని గురించి యోచించుకొనుటలో ఆశ్చర్యంలేదు. ప్రసాదునకు అదిఅనుమానాస్పదముయింది. తన యవ్వనమంతా ప్రసాదువంటి కాముకులకు అర్పణచేసి తన వార్ధకావస్థలో చేయవలసినపనేమిటా అన్నది కమలను ఎదుర్కొన్న ఒక విషమసమస్య. ముసలితనంలో తమను పోషించి రక్షిస్తారనే కదా మానవుడు సంసారసాగరం దుఃఖమయమైనా దానిలో దుముకుతున్నది?

అప్పటిలో ప్రసాదునకు ముందుచూపులేదు. తనను వివాహం చేసుకోమని ఆమె అడిగినప్పుడల్లా ఆమెను అనుమానిస్తూ వచ్చాడు. అది ఇతరు లెవరో తనను వంచించడానికి పన్నిన పన్నాగం అనుకున్నాడు.

కమల అందరివలె వ్యభిచారిణి కాదని అతనికి తెలుసు, విధివశంచే మిత్రునిచే విడువబడి తనకు సంక్రమించిన స్వర్గసౌఖ్యమనిన్నీ తెలుసు. కాని ఆమె భావిజీవితాన్ని గురించి చిన్న మెత్తైనా అతడు యోచింపలేదు. ఆమె 'నన్ను పెండ్లిచేసుకోండి' అని అడిగినప్పుడు అతడు ముని అయ్యేవాడు.

౫

కమలకు ఇప్పుడు వేరొకనితో వివాహం ఐంది.

కమలను వివాహం చేసింది ప్రసాదే అయివుండవచ్చు,

కాని కమలకు ప్రసాద్‌పట్ల విశ్వాసానికి బదులు విముఖత కలిగింది. తీయని కబుర్లు చెప్పి తన సర్వస్వము దారగొని తుదకు ఆ ప్రణయమును భగ్నంచేసి తన్ను అన్యులకు పప్పగించాడుకదా అని ఆమె బాధ.

ప్రసాదుకి నేటికికూడా ఆమెమీది అనురాగం పోలేదు ఆమె ప్రతిమను నిత్యము ఆరాధిస్తాడు.

చేజిక్కినదానిని చేతులారా అన్యులకు ధారపోసి ప్రతిమను ఆరాధించే ప్రముఖులలో ప్రసాదు ఒకడైనాడు. సంఘమునకు తన ప్రణయసామ్రాజ్యమును బలియిచ్చాడు. కాని ఆమాట అతడు అనడు.

# విచిత్రవివాహంలో వితంతువులు

[శ్రీ పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు శారద చట్టసందర్భంలో రచియించిన 'విచిత్ర వివాహ' నాటకములో వివిధ పాత్రలచేత- వితంతువులనుగురించి పలికించిన పలుకులు.]

ఆఁడుబడుచు లాంఛనాలకైదువంద లీయవలెనంటివే. పుణ్యస్త్రీకిఁ బచ్చగఁ బచ్చగ లాంఛనాలు కాని వితంతునకు లాంఛనాలేమిటి? మాకు లాంఛనాలు పాత్రిపంచ, మినపరొట్టె, విభూతిపండు, రుద్రాక్షల తావళమే కాదా ?

*　　*　　*

ఆమూలనోట మట్టికొట్టుకొని యాయన పోయినాఁడు కాని యామె కాఁడుపడుచుందనము పోయినదా? చెంగునకు అంచుపోయినది కాని నూటఁగట్టుకొను ముచ్చట పోయినదా? కాంతుఁడు పోయినాఁడు కాని కట్నపాళ పోయినదా ?

*　　*　　*

నీకంటెకిది వారి కొక్కటె యున్నది కాదా? ఒకరి నొకరాక్షేపింప నక్కఱ లేదు. వితంతువు లేని యిల్లెక్కడనైన నున్నదా? వెన్నువాసము లేని యిల్లున్నది. మందువాలేని యిల్లున్నది. నూయిలేని యిల్లున్నది. దేవతార్చనలేని యిల్లున్నది. మగవాఁడులేని యిల్లున్నది. పిల్లలేని యిల్లున్నది. వితంతువులేని యిల్లులేదు. వితంతువే యింటికిఁ బునాది. పుణ్యస్త్రీలు సంసారమున రవంత పైపై యలంకారములు, మెఱుఁగులే కాని సంసారమునకుఁ బ్రధానవస్తువే వితంతువు. శుభకార్యములో నన్నియిండ్లలో వారి పెత్తనమే కాదా ?

ఏఁబదియేండ్లు దాఁటిన విధవ పుణ్యస్త్రీతో సమానురాలు. అనాథసంబంధమైన దోషమంతయు నగ్నతాగ్రములోపలనే. ఎందుచేత ననఁగా, స్త్రీలకు ఋతుసంబంధమైన దోష మేఁబదిలోఁగట్టునదును. అది యెప్పుడు కట్టువడినదో యప్పుడు కన్యాత్వమున్నమాటయే. కన్య యనునది సువాసినియే కాదా? కాబట్టి ఆ మడిలోఁ బళ్ళెరాతుగును గూరుచుండఁబెట్టి గౌరీపూజఁజేయింపవచ్చును.

*　　*　　*

వితంతువైననేమి ముక్కుపచ్చలారని స్త్రీని. చూచినారా? ఎక్కడను వితంతు లక్షణమే యగపడదు. ఇంతకు మనకుఁ బ్రధానమైనవి శిరోజములు. అవి సందేఁడున్నవి. కాబట్టి, ఆమె యిలుపట్టిన స్త్రీది ఐనా పెండ్లికొడుకునకుఁ గల్యాణము బొట్టువెట్టి రవంత పారాణి కాళ్ళకుఁ బెట్టవచ్చును.

*　　*　　*

నా ప్రపంచజ్ఞానమునుబట్టి ప్రతి వితంతువును నేదో యొక దయ్యమాశ్రయించియే యుండును. రాత్రిభాగమందు దయ్యానికైనసరే, దేవతకైనసరే పడుచు వితంతువును జూచినప్పుడు బుద్ధి రేఁగక మానదు. ఈవాంఛలో మట్టుకుఁ బైలోకమువారికిఁ, గ్రిందిలోకమువారికి భేదములేదు. చచ్చినవారికి బ్రదికినవారికి భేదములేదు.

# ఆకుకూరలు

అవిసె - ఉస్తి - కరివేప - కానుంచి - కాబేజీ - కొత్తిమిరి- కోలపాల - గుంటగలగర - గోగు - చక్రవర్తి - చామ - చింత - చిత్రి- చిలుకకూర - చుక్క - తమలపాకు - తుమ్మి - తోటకూర - దొగ్గలి - దోస - నీరుల్లి - పుదీనా - పొన్నగంటి - బచ్చలి - బలుసు - బొద్ది - మునగ - మెంతి - వేప - సరస్వతి- సీకాయ అనే ముప్పయి ఒక్కరకాల ఆకుకూరల వివరాలు గలవు. ఆకుకూరల ప్రాశస్త్యాన్ని వివరించే చక్కని పీఠికకూడా వున్నది.

*

## పత్రికల ప్రశంసలు

ఆకులను కూరలుగా వండుకొనియో, పచ్చివిగానే భుజించియో ఆరోగ్య భాగ్యమునకై ఏమేమి లాభములను పొందవచ్చునో తెలుపబడినది. —గోలకొండ.

ఇందులోవున్న విషయాలు అందరూ తెలుసుకోదగినవనేది నిర్వివాదాంశం.

—ఆంధ్ర వారపత్రిక.

చదువనేర్చిన ప్రతిస్త్రీ తప్పక చదువతగ్గ గ్రంథం. —జ్యోతి.

*

# పులకరింపుకోసం

## [డ్రాయింగ్ రూమ్ ప్రహసనం]

[ఏకాంకిక]

[ఇంగ్లీషు చదువు మన పడుచుల్లో ఒక్కొక్కచోట ఎటువంటి వెర్రి తలలు వేయిస్తూవుందో ఈవ్యాసం నిరూపిస్తూవుంది—సంపాదకుడు.]

రచయిత:

గుంటూరు సత్యనారాయణ, యం.యే.

[విశాలమైన ఒక గది. ఎడంచేతివేపు వెనుకకు ఒకద్వారం. అందులోంచి ప్రవేశించి చూస్తే కుడిచేతివేపు మెత్తటి పరుపులతో ఒక పాతసోఫా; మూలకు ఎత్తైన బల్లమీద గాజుకూజాలో వాడిపోయిన పువ్వులు; హాలుమధ్య ఒక పెద్ద మేజా, చుట్టూ కుర్చీలు; గోడలకు పటాలు లేవు; ఎదురుగా ఒకపాతగడియారం; ఎడంవేపుమూలకు పడకకుర్చీలో సుశీల కూర్చొని 'ఫిల్మిండియా'లో మునిగి ఉంటుంది; ప్రక్కన బల్లమీద షెల్లీ, బైరన్ మొదలైన ప్రసిద్ధాంగ్లకవులూ- కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ మొదలైన నవ్యాంధ్రకవులూ దుమ్ముపట్టి ఉంటారు. సాయంత్రం అయిదుగంటలు. సుశీలకు 17 సంవత్సరాలు; సహజంగా చెప్పుకోతగ్గ అందకత్తె కాకున్నా, నవీనరీతులలో నాజూకు అలవరచుకొన్నది; కళ్ళలో ఆదర్శప్రపంచధోరణి ద్యోతకమౌతూ ఉంటుంది.

టీ కెటిల్ పట్టుకొని మహాలక్ష్మమ్మ ప్రవేశిస్తుంది. 40 సంవత్సరాల మనిషైనా, స్థూలకాయంమీద వయసు కనిపించదు.]

మహా—సుశీ!

సుశీ—(అదిరిపడి) ఆఁ?

మహా—(టీ బల్లమీద పెడుతూ) ఎంతసేపైంది కాలేజినుంచి వచ్చి? రాగానే ఓ కేక వెయ్యకూడదు టే? టీ చల్లారిపోతోంది, చప్పున తాగు.

సుశీ—ఇంటికివస్తూ ప్రభాకరం టీకి పిలిస్తే పుచ్చుకొనివచ్చేను. అంచేత పిలవలేదు.

మహా—(మధ్యనుంచి ఒక కుర్చీ సుశీదగ్గరగా లాక్కొని) రోజూ మా బాగుందే, అమ్మాయ్! మీ ఇద్దరూ అంత జోస్తీగా తిరుగుతూంటే చూసేవాళ్ళేమనుకుంటారు?

సుశీ—(ఆవలిస్తూ) ఇది వెయ్యోమారు నువ్వాకబురుచెప్పడం. చూసేవాళ్ళేమనుకుంటే ఏం? మనకేంఆరుస్తారా?తీరుస్తారా? మేఁవేం తప్పుచేసేం? ఒకర్నొకరం ప్రేమించుకున్నాం. అది తప్పా? ప్రేమ ఒక పరంజ్యోతి; ప్రేమలేని జీవితం చిగురులేని మోడు; ప్రేమ, నిబిడ హేమంతరాత్రీ తమాల మేదురాన్ని ఛేదించే ధ్రువతార; మరో ప్రపంచంలోగాని అది—

మహా—(బిక్కమొహం వేసుకొని) ఒసేయ్, ఏఁవిటీ వరస? ఘోర్తు ఫారంతో ఆపేనుంటే వినక బి.ఏ. చదివించేరు మీనాన్న; ఈ పిచ్చి ఆయనకే బోధపడాలికాని నాకు తెలీదు. చక్కాసితోటి వాళ్ళు పిల్లల్నిగని—

సుశీ—అమ్మా! నాకు విసుగెత్తించకు. ఎందుకే వెధవ పిల్లలు. పిల్లలూ, సంసారం ప్రేమప్రవాహాన్ని అరికట్టేస్తాయి; పళ్ళచెట్టుదగ్గర ముళ్ళకంచెలు పిల్లలంటే!

మహా—(బుగ్గనొక్కుకొని) అదేవే నీకొచ్చిన ఓఘాయిత్యం! అయినా వేగం నీకు ముడెట్టించేస్తేగాని ఈ జబ్బు ముదిరి సన్నాసుల్లో కలుస్తావేమో కూడానూ—!

సుశీ—(కళ్లుమీదికి తిప్పి ఆకాశంలోకి చూస్తూ) ఛస్! అమ్మా! నువ్వు నా ఆశయాలకు అం

దవు. నే నిలా మాటాడుతున్నప్పుడు నవ్వేం చెయ్యాలి? కళ్ళంట నీళ్లు పెట్టుకొని, నన్ను కౌగలించుకొని, 'అమ్మలూ! నీ కెలా ఇష్టమైతే అలాగే చేస్తాం, నువ్వు బెంగపెట్టుకోకు—' అంటే ఎంత పులకరింపుగా ఉంటుంది! ఇన్ని తెలుగు సినీమాలు చూసేవు ఈమాత్రం తెలీదేమే నీకు!

మహా—ఓసి నీదారుణం కూల! నిండింట్లో ఏమిటా మాటలు! నిన్ను కౌగలించుకొని ఏడవట మెందుకే! నీ యిష్టమొచ్చినట్టే ఆడుతున్నారు గాని మీ నాన్న నామాట వింటున్నారా?

సుశీ—అదే అంటూన్నది! నాకు జీవితంలో పులకరింపు లేకుండా పోతున్నది. నేను ప్రభాకరాన్ని ప్రేమించేనని నాన్నతో చెప్పడానికి అందుకే భయపడుతున్నాను. తీరా చెబితే ఒప్పేసుకుని మా ఇద్దరికీ పెళ్ళిచేస్తాడాయన!!

మహా—(ఆశ్చర్యంగా) అయితే పెళ్ళిచేసుకోకుండా అతడితో—!

సుశీ—మ రేమిటనుకున్నావ్, ఆదర్శప్రేమను జీవితంలోకి దింపడమంటే! నాన్న నీకంటె ఫెయిల్యూరు. నే చెప్పినదానికల్లా 'ఊ' కొట్టకుండా, ఏపల్లెటూరి వాణ్ణో నాకు కట్టపెట్టాలని నిశ్చయించుకొని, నేను మా ప్రేమ సంగతి చెప్పగానే అగ్గిరాలుస్తూ 'ఫో, ముండా! ఇంట్లోంచి, నువ్వు నాకు కూతురివి కావు!' అని తగిలేబోతే, నువ్వు నన్ను కౌగలించుకొని నాన్నతో 'ఏమండీ! అభం శుభం ఎరగని దాన్ని ఎందుకలా కోప్పడతారు? దానికి మనసులేని మనువెందుకు?' అని దీనంగా ప్రార్థిస్తే ఎంత బాగుంటుందో నీకేం తెలుసు! కాని నాన్నా, నువ్వూకూడా నా ఆశయాలకి విరుద్ధమే. నాన్నకు 'పాడు సంఘా'న్ని ప్రతిఫలించడం తెలీదు. అంచేత నాకు కోపం వొస్తుంది ఆయనమీద!

మహా—నీ కేంఖర్మ వే? ఒక్కగానొక్కదానివి నీయిష్టం కాకపోతే మాకింకేవుందే? అయినా ఎప్పుడో పూర్వం మా తాతలనాడుగాని ఈ రోజుల్లో ఈ పట్టింపులే లేవు; అలాటప్పుడు నీకెందు కద్దుచెబుతారు తల్లీ మీనాన్న!

సుశీ— (విసుక్కుంటూ) లలిత కళలు జీవితాన్ని ప్రతిఫలింపజేస్తాయి, సాధ్యమైనంతవరకు వాటిని మనం అనుసరిస్తేనే పులకరింపు వుంటుంది. మన సాహిత్యం, నాట్యకళా చూడు— పవిత్రప్రేమనూ, పాడు సంఘాన్నీ ఎప్పుడూ చూపిస్తాయి! ఈరెండూ నాకు లేకపోతే ఎలాగేమరి! మానవ జీవితాదర్శం ప్రేమ! దానికి ప్రతిద్వంద్వి పాడు సంఘం! ఇన్ని కథలు చదివేకేనా, ఇన్ని సినీమాలు చూసేకేనా నాన్నకి ఆమాత్రం తెలివుండొద్దూ! కొంచెమేనా పాడు సంఘాన్ని ప్రతిఫలించి—

*

(తెనకతలుపు తెరుచుకొని కామేశం పంతులు ప్రవేశం. 50 సంవత్సరాలు; చామనచాయ; పొట్టిగా, బొద్దుగా ఉంటాడు; బట్టతల; అప్పుడే రైలుదిగివస్తూన్నవాడిలా కనుపిస్తాడు హామేషా)

కామే—ప్రతిఫలించడం ఏమిటి? అని కుడివైపు సోఫాలో కూచుంటూను.)

మహా—అప్పుడే పావుగంటనుంచీ ఉపన్యాసం దంచేస్తోంది మనం ఆమెకు నచ్చలేదట!

కామే— (చిరునవ్వుతో) నచ్చకపోవచ్చు!

మహా—(లేచి వెనుకవైపు ద్వారంవద్దకు వెడుతూ) అదేమో మీ ఇద్దరికే తెలియాలి! మీ నాన్నతో నే చెప్పమ్మా ఆ ముచ్చట! నాకు పనుంది (నిష్క్ర)

కామే—ముచ్చ టేమిటి సుశీ! ఇవ్వాళ బీచికి పోకుండా మీ అమ్మతో శాస్త్రవాదం వేసుకు కూర్చొన్నావేం?

సుశీ—ప్రభాకరం వస్తానన్నాడు. (ఒక్కసారిగా ఆలోచన మెరిసి) నాన్నా! కాస్మాపాలిటన్ క్లబ్బులో రాత్రి డాన్సు ఉన్నాది. వెళ్ళమన్నావా!

కామే—నీకు వెళ్లాలనుంటే వెళ్లు!

సుశీ—(దెబ్బతిన్నట్టు పడిపోయి, ఆఖరు ప్రయత్నంలాగ) అక్కడ యూరోపియన్లు చాలా మంది ఉంటారు. వాళ్ళతో డాన్సు చెయ్యమంటే—

కామే—నీకు చెయ్యాలనుంటే చెయ్యి!

సుశీ—(నిస్పృహతో కూలబడి) ఛా! ఏమిటి నాన్నా నువ్వు అన్నిటికీ బసవన్నలా తల వూపేస్తావు!

కామే—ఏం చెయ్యమంటావైతే!

సుశీ—నీకు మనస్సులో నన్ను సంతోష పెడదామని ఉబలాటం ఉన్నా- మనది పాడు సంఘం అనీ, అందులో నువ్వు నాన్నవి అనీ మరిచిపోకూడదు.

కామే—ఎవరన్నారు మనది పాడు సంఘం అని?

సుశీ—ఏమిటినాన్నా, చిన్న పిల్లాడిలాగ? అన్ని కథలు చదివేవు! అన్ని తెనుగు ఫిల్ములు చూసేవు! ఎంచక్క అందులో 'నాన్న'లు మాడు పాడు సంఘాన్ని ఎలా ప్రతిఫలిస్తారో? వాళ్ళకి ఎంచక్క హృదయం ఉండదు. చక్కా అలాటి 'నాన్న'ల్ని ఎదిరించి, ఇల్లు వదిలి పరారీ అయి విశాలవిశ్వంలోకిపోయి, పవిత్ర ప్రేమను నెమరువేస్తూండే, కథానాయికల్ని చూసినా, తలుచుకొన్నా ఒళ్లు పులకరించి పోతుంది. నువ్వలా కాదు. నీకు హృదయముంది.

కామే—అయితే అంచేత నా హృదయాన్ని చంపేసుకోమంటావా! కన్నపిల్లమీద ప్రేమ కాదనమంటావా?

సుశీ—(రోషంతో) లేకుంటే నువ్వు 'నాన్న' వెలాగౌతావు! నీకు హృదయముంటే, సంస్కర్త లేమైపోతారు? పవిత్రప్రేమకు నీ అడ్డులేకపోతే మన కవికుమారులు మట్టికొట్టుకుపోరూ? నీకు హృదయం ఉన్నట్టు ఏమాత్రం చూపించినా సినీమావాళ్ళకుకథ లెలావస్తాయి! ఒక్క నీహృదయంకోసం పరమపవిత్రమైన లలితకళల్ని ఇలా మాడ్చేస్తావా! అంతగా నీకు మనసైతే, చిట్టచివర్ని మరో పులకరింపుకోసం, నీ హృదయం చూపించి పశ్చాత్తాప పడొచ్చుగాని, నవీన భావాల్ని మొదటినుంచీ అర్థం చేసుకొన్నట్టుగాని, వాటితో అంగీకరించినట్టుగాని ప్రవర్తిస్తే నీ 'నాన్న'త్వం చచ్చిపోదూ!

కామే—ఏదో సరదాకైతే తప్పకుండా అలాగే అడ్డుపెడతాన్లే, పోనీ నీకంత ముచ్చటైతేను! మరి నీపవిత్రప్రేమ ఎవర్ని చూరగొన్నది?

సుశీ—ప్రభాకరాన్ని.

కామే—(మరిచిపోయి) శుభం. ముహూర్తం రేపే— (నాలిక కరుచుకొని, తన పాత్ర జ్ఞాపకం తెచ్చుకొని, కళ్ళెర్రజేసి) ఆ వెధవా! వాణ్ణీమారు నా గుమ్మం తొక్కనివ్వను! వస్తే కాళ్లు విరగ్గొడతా, (మళ్ళీ మామూలు ధోరణిలో) ఏం, ఇలాగేనా సుశీ?

సుశీ—(పెదవివిరిచి) నేను చెప్పిన మీదట నువ్వు నటిస్తే పులకరింపు ఏమిటుంది! నీకు ప్రభాకరంఅంటే ఇష్టమే. నేనన్నా ఇష్టమే. అంతవరకూ సవ్యంగానే ఉంది. కాని మా ఇద్దరికీ పెళ్ళంటే కూడా ఇష్టమే ఐతే చమకీలేదు. ఇంతకీ నీకు మాఇద్దరిమధ్యా ప్రేమ ఉన్నదని తెలిసిపోయింది. ఇంతకు ముందు నాకేదేనా సంబంధం చూసేవా నాన్నా!

కామే—లేదు.

సుశీ—నే ననుకొన్నాను. నువ్వు 'నాన్న'పార్టు ఈ సంఘంలో నటించలేవు. ఈపాటికి మరో సంబంధం చూసిఉంటే ఈ నా ప్రేమవార్తకు నీకు నిజంగా కోపంవచ్చి ఉండును.

కామే—నిన్నడగకుండా నీకు సంబంధమెలా చూడను!

సుశీ—అదే చెబుతున్నా. నన్నడిగితే నీ 'నాన్న'త్వమేదీ!

*

(వెనుకనుండి ప్రభాకరం ప్రవేశం. ఇరవైమూడు సంవత్సరాల వయసు; అందగాడు; నవనాగరిక వేషం.)

ప్రభా—(కామేశంతో) నమస్తే. హల్లో! సుశీ!

కామే—రా, కూచో, (లేచి నిలబడి) నేనిప్పుడే వస్తా బట్టలు

మార్చుకోని (నిష్క్రి)

సుశీ—(విచారంగా) ప్రభాకరం! మానాన్నా అమ్మా కూడా నాకు జీవితంలో కావలిసిన ఉద్రేకం ఇవ్వలేరు!

ప్రభా—(ఆతురతగా) ఏం? ఏంజరిగింది? మన వివాహసంగతి తెచ్చేవేమిటి? మీనాన్న ఒప్పుకోలేదా?

సుశీ—ఒప్పుకోకుంటే బాగుండును. ఒప్పుకోబట్టే ఈ అవస్థ!

ప్రభా—అదేమిటి సుశీ అలా అంటావు! మరి మన పవిత్ర ప్రేమను మరిచిపోయేవా? మన ప్రమాణాలప్పుడే విస్మరించేవా? నాధర్మపత్నివి కావడానికి ఎంత త్యాగమేనా చేస్తానన్న మాట—

సుశీ—ఏదీ ఛాన్సేదీ? మానాన్న గంగిరెద్దులాగ నేనేమన్నా సరే అంటూంటే నా త్యాగంగాని, పాడుసంఘపు సంకెళ్లుగాని, మన ప్రేమ పవిత్రతగాని ఎలా ద్యోతకమౌతాయి? నా ధర్మపత్నీత్వం ఎలా స్థాపితమౌతుంది.

ప్రభా—(నవ్వుతూ) ఇదా! నీధర్మపత్నీత్వం, త్యాగం లేకుండానే స్థాపితమౌతుందిలే!

సుశీ—అలా ఎన్ని పెళ్ళిళ్లు జరగలేదు! అలా చేసుకొన్న ఇల్లాళ్ళంతా ధర్మపత్నులై ఊరుకోగలరా? ఎంతసాహసంకావాలి! నాన్ననీ, తద్వారా పాడు సంఘాన్నీ ఎదిరించి, అమ్మని ఏడిపించి, ప్రియుడితో లేచిపోతేగాని ధర్మపత్నీత్వంలభిస్తుందా? లభించినా దాన్లో సాహసకార్యం ఉందా?

ప్రభా—(తెల్లబోయి) అయితే నన్ను పెళ్లాడనంటావేమిటి?

సుశీ—నేను పెళ్లాడతాననే అంటున్నాను. కాని 'నాన్న' అనే ఈ పాడు సంఘం ఎందు కంగీకరించాలీ అంటాను! నా త్యాగం దొంగిలించి, నాకు చవకబారు ధర్మపత్నీత్వం బనాయించడానికే మా 'నాన్న' ఎత్తు! దాన్లో పులకరింపు ఏమీ లేదు!

ప్రభా—అయితే ఈ పరిస్థితుల్లో మరి నీకు పులకరింపు ఎలాగ లభిస్తుంది? నేను కావాలా, పులకరింపు కావాలా?

సుశీ—రెండూను! ఒకలా చేస్తావా?

ప్రభా—ఎలాగ?

సుశీ—మనది పవిత్రమైన ఆదర్శ ప్రేమ అని ఒప్పుకుంటావా?

ప్రభా—(ఆశ్చర్యంగా) మరోవిధంగా ఎప్పుడన్నాను?

సుశీ—ఆదర్శప్రేమకు బాంధవ్యం లేదుకదూ?

ప్రభా—లేదు.

సుశీ—(సంతోషంతో) అయితే నీ ప్రేమ సోదరప్రేమలోకి మార్చేసుకోకూడదూ? మన ప్రేమకు ప్రేమా ఉండిపోతుంది—పులకరింపు కూడా ఉంటుంది!

ప్రభా—(విస్తుబోయి) ఏమిటి సుశీ ఈమాటలు? అదెలా సాధ్యమౌతుంది?

సుశీ—(కొంచెం చిరాకుగా) ఎందుకుకాదూ? పవిత్రప్రేమలో ఇలాంటి తర్జుమా చాలాసులువు. లలితకళలన్నిటిలోనూ ఈ తర్జుమా సెకెండ్లమీద జరుగుతుంది.

ప్రభా—సుశీ నీ పులకరింపు కోసమని చెప్పి నాహృదయాన్ని భగ్నంచెయ్యకు!

సుశీ—నీకు మరి నయంకాదూ? అప్పుడు ప్రేమయోగివౌతావు!

ప్రభా—సుశీ! ప్రేమించడంలో ఉండే పులకరింపుకోసమే ప్రేమిస్తున్నావుగాని నిజంగా నేనంటే నీకు ప్రేమలేదన్న మాట!

సుశీ—ఔను. ప్రేమలో బాంధవ్యం లేకపోవటమేమిటి లేకుంటే, ఇన్నాళ్ళనుంచి ఇన్ని కబుర్లు చెబుతున్నావు పవిత్ర ప్రేమ అంటూను; ఆమాత్రం నాకోసం ఒక్కసారి సోదర ప్రేమ చెయ్యమంటే ఊరికే గింజుకుపోతున్నావు, నీ సొమ్మేదో పోయినట్టు. నువ్వా ఈ పాడు సంఘంలో 'ప్రేమ' యోగిపాత్ర నటించలేవు, నువ్వూ అందరికంటె ఫెయిల్యూర్‌వి.

ప్రభా—నువ్వో, సుశీ?

సుశీ—(కిటికీలోంచి అవతలకు చూస్తూ) నేనో?... నేనో?

# అతని పండగ

[ చిన్న కథ ]

'గ్రహణదినములే తనకు పండగలు వాళ్లు ఏడవనీ, మైలపట్టనీ, బాధపడనీ తనమాత్రం ఆరోజున పండగ అనుభవిస్తాడు.'

రచయిత:
జనస్వామి కోదండరామశాస్త్రి

'వెంకూ? వెంకూ?' అని పిలుస్తూ వెంకటేశ్వర్లగది తలుపు తట్టాడు సుదర్శనరావు.

పులికిపడి నిద్రలేచి కళ్లు నలుపుకుంటూవచ్చి వెంకటేశ్వర్లు తలుపుతీశాడు. సుదర్శన్ లోపలకు వచ్చాడు.

'ఏరా సుదర్శన్? మీ రాణీగారు ఇంచాక జట్కాబండీలో వెళుతోంది ఎక్కడికీ?' అని అడిగాడు వెంకటేశ్వర్లు.

'మా అత్తవారింటికి రా. రేపు సంక్రాంతిపండుగకదూ?'

'పండగ' అన్న మూడక్షరాలూ వినిపించగానే అతనిముఖం కళావిహీనమైంది. నేత్రముల్లో విషాదచ్ఛాయలు పొడచూపినై. సుదర్శన్ ఏమిటేమిటో మాట్లాడుతున్నాడు. ఏమేమో చెపుతూన్నాడు.

ఏవేవో విశేషాలు చెప్పిచెప్పి సుదర్శన్‌కి విసుగెత్తుతోంది. యీ మాటల్లో ఒక్కదానికైనా వెంకటేశ్వర్లు వద్దనుంచి ఏవిధమైన జవాబూ లేదాయె! 'పండగ' అనే యీమూడక్షరాలూ వెంకటేశ్వర్ల మెదడ్ని కటకటా నలిపేస్తున్నయి. సుదర్శన్ నిరుత్సాహియై 'వెళుతున్నారా వెంకూ' అని అంటూ లేచి నిలబడ్డాడు. అప్పుడుకూడా వెంకటేశ్వర్లు నోరుతెరిచి 'వెలుదువుగాని లేరా' అని అన్నా అన్నట్లయితే, సుదర్శన్‌కి యింకోగంటపాటు బాతాఖాని కొట్టడానికి అవకాశం కలిగేదే! అప్పటికీ అమాట అనికూడా ఓ అయిదు నిముసాలు అల్లాగే నిల్చొని వున్నాడు. వెంకటేశ్వర్లు అతనివంకయినా చూడటం లేదు. 'ఇక యిక్కడలాభంలేదు. అటు క్లబ్బుకైనా వెళితే ఓగంటసేపు బాతాఖానికి వీలుంటుంది' అనుకుంటూ సుదర్శన్ మెల్లిగా బయటకు జారుకున్నాడు.

వెంకటేశ్వర్లు తలుపులుమూసుకుని నీరసంగా మంచంపై వాలాడు.

తనుఒక్కడు— యీ ప్రపంచంలో తనకు తను ఒక్కడే. తన సహృదయాన్ని చూచిమెచ్చుకుని దేవుడిచ్చిన వరమేమో తనకీ ఒంటరిబ్రతుకు!

పండగ...

తనకో పండగ...

పండగ అనేది లేకండా యీ ప్రపంచంలో ఎన్నడు నశించిపోతుందో, తన హృదయానికి అప్పుడు శాంతి చిక్కుతుంది.

ఈ ప్రజలు పండగలని అనుకుని ఆనందించేరోజులన్నీ తనకు పండుగలుకావు. తన కొంపకూల్చిన దుర్మార్గపుశక్తులు. తన జీవితపతనానికి కారణమైన పిశాచకారులు. 'పండగ' అన్న యీ మూడక్షరాలూ వినిపించగానే తనహృదయం యింత ఎక్కువగా దద్దరిల్లిపోతుందేమిటీ?

భయం. హడల్. పెద్దపులి తనపై దూకపోతున్నపుడు కూడా తన హృదయం అంతగా భీతిల్లదేమో? తనసి మినహాయించి యీ ప్రజనంతటినీ ఆనందతరంగములలో ఉయ్యాలలూగించే యీ పండగలు తన బ్రతుకులో భగభగ మంటల్ని ఎందుకు రగుల్కొల్పుతున్నవో?

తనూ మానవుడేనే. జీవితాన్ని మొదటినుంచీ తను సన్మార్గంలోనే గడుపుకుంటూ వస్తున్నాడే. ఇప్పటికీ తనలోని దైవభక్తి వీసంపాలుకూడా తరగలేదే.


అయినప్పుడూ, అందరూ ఆనందించే యీ పండగలు తనజీవితానికి 'భగభగమంట'లుగా ఎందుకు కావాలీ? రేపటిరోజున సంక్రాంతిపండుగా... సంక్రాంతి... మకర సంక్రాంతి... పితృదేవతలకు నీరువదలడానికి యోగ్యమైన

పర్వదినం...అల్లుళ్లు తమ అత్తింటికానుకల్నూ, ఆడపడుచులు తమ పుట్టింటికానుకల్నూ అందుకుని సంతృప్తిపూరిత హృదయాలతో ఆయావంశముల జయము కోరుతూ శుభాశీస్సులు కురిపించే శుభదినం... కాని తనకో... చేతి కందొచ్చిన తన ఏకైకపుత్రరత్నాన్ని బలితీసుకున్న దయాదాక్షిణ్యాలు లేని కర్కోటకపురోజు. తన వంశపు నాశనాన్ని కోరిన అశుభదినం...

దీనివలెనే అదిగూడా ఏదో పెద్ద పండగ అంటారే — అవును సంవత్సరాది...వసంతలక్ష్మికి కర్పూరహారతులతో సుస్వాగతమునిచ్చే పవిత్రదేవతా కన్య...ఆసమయం.

బరువెక్కువైపోయి నడుములు ఒంగి అలసిపోతోన్న వృక్షరాజాలకు దాహము తీరుస్తూ, వాటి శ్రమనంతనీ చేతులతో తీసివేసి ప్రాణదాన మొసగే దయామయి...ఆ సంవత్సరారంభదినం. కాని తనకో... తనకు అత్యంత ప్రియమైన భార్యను పొట్టన పెట్టుకున్న...

అవును...అదీ పెద్దపండగే...విజయదశమి...ఆకాళికాదేవి మహిషాసురుణ్ణి




హతమార్చిన మాట ఏమోగాని... సద్గుణ సంపన్నయైన కాపురంచేసే తన ఏకపుత్రికారత్నాన్ని మాత్రం పరలోకానికి పంపింది...పిన్నల హృదయాల్ని అమితోత్సాహంతో నింపుతూ, పెద్దల కాహ్లాదమును కూరుస్తూ, సుందరంగా తాండవించే ఆపసరా తనలోని కడుపుమంటని రెట్టింపుచేసింది.

దీపావళి ... దీపావళో ... నూత్న వస్త్రాలంకారులై మురిసిపోయే ప్రజలకు...వెలుగు కాగడాలు చేతికిచ్చి... 'ఓ భూదేవీ? ఇదే నీకు నీరాజనం. మమ్ము సర్వ అశుభములనుంచీ కాపాడుమా!' అని మానవులచే భూదేవిని ప్రార్థింప చేస్తున్నదా అనిపించే దీపావళి, 'నా' అన్నవారందరూ గతించిపోగా మిగిలిన తన ముసలితల్లిని కాస్తా, ఆ కాగడామంటలతో కాల్చేసింది.

ఓ...తను మర్చిపోయాడు. ఆశివరాత్రో...తనుమాత్రం ఎందుకు [illegible]కోవాలని కాబోలు...తన ఆస్తినంతనీ కోర్టుకు వేలానికెక్కించి...తన నెత్తిపై దరిద్రదద్దమ్మను ప్రతిష్టాపనచేసిన...

ఇవి తనకు పండగలా? గుండెల్లో రగిలే నిప్పుకణాలు కాని...

తనకు నిజంగా... పండగ... గ్రహణపురోజున. సూర్యచంద్రాదులు సర్పం నోట్లోపడి నలిగిపోతున్నారని యీప్రజలందరూ ఏడుస్తారు. మైల అంటారు. స్నానాలు చేస్తారు... కాని తనకు అదే శుభదినం...మహాపర్వం. నిబిడాంధకారమైవున్న తన జీవితాకాశంలో ఒక కాంతి కిరణాన్ని ప్రసరింపచేసింది ఆ దినం...విషాద పీడితమైన తన హృదయానికి ఒక ఆనంద తరంగమును రుచిచూపింది ఆగ్రహణదినం. కలకలలాడే తన ఆకలిమంటల్ని శాంతింపచేసింది—యీపాతిక రూపాయల ఉద్యోగానికీ దారిచూపింది.

గ్రహణదినములే తనకు పండగలు. వాళ్లు ఏడవనీ, మైలపట్టనీ, బాధపడనీ తనుమాత్రం ఆరోజున 'పండగ' అనుభవిస్తాడు.

* * *

తెల్లవారింది. నిద్రలేచి, ముఖప్రక్షాళన చేసుకుని బయటి అరుగుమీద కొచ్చాడు అతను. పారమార్థిక చింతాపరులు కృష్ణానదిలో స్నానంచేసి, నీరు పిండిన గుడ్డలు చుట్టుకుని అతని ముందుగా పోతున్నారు. వారిలో ఒకరైన సుదర్శన్ అటునుంచి వెళుతూ 'ఏరా వెంకూ? మహత్తరమైన పర్వదినంకదా? ఇవ్వాళ్ళ అయినా ఆ కృష్ణకు ఏడవకూడదూ?' అన్నాడు. అతనికి శరీరంపై కారం చల్లినట్లయింది. 'ఛస్. నేను ఏడిచేరోజులు వీళ్ళకందరికీ పర్వాలూ, పండగలూనూ. నాపండగరోజులు వీళ్ళకి ఏడిచేరోజులు. వెధవాయ్‌లు.' అని కొరకొరా చూస్తూ లోపలకెళ్ళి తలుపు రెక్కలు మూసేశాడు.

మధ్యాహ్నం మూడుగంటలకు ... మళ్ళీ సుదర్శనం తయారు. బాతాఖానీ ఉపన్యాసం ఆరంభమైంది...మకర సంక్రాంతి ప్రశస్తతనుగూర్చి ఒక చిన్న లెక్చర్ మొదలెట్టాడు.

'పండగ' అన్న మాటక్షరాలూ వినిపించగానే వెంకటేశ్వర్లు కళ్లెఱ్ఱచేసి 'ఒరేయ్? నీ వెధవ ఉపన్యాసాలూ, లేతలేత సొరకాయకోతలూ ఆపుచేసి బయటికి నడుస్తావా? లేకపోతే లంపకాయ కొట్టమన్నావా?' అన్నాడు గాంభీర్యంగా.

సుదర్శనం గాభరాపడుతూ బయట కెళ్ళిపోయాడు.

పండగ—తన కొంపకూల్చేసిన నాశనకారి. తన వంశాన్ని మాడ్చేసిన అగ్నిగుండం. తలుపులేసుకుని తను లోపల కూర్చున్నా ఆ మూడక్షరాలూ తనకు వినిపిస్తూనే వున్నాయి.

ఆమాట వినపడకుండా కాస్సేపు అక్కడా, అక్కడా తిరిగివస్తే ... బయల్దేరాడు. తల ఒంచుకుని నడుస్తున్నాడు. కొంచెం దూరం సాగి వెళ్ళిన తర్వాత......ఆ పెద్ద మేడలోనుంచి పకపక నవ్వులధ్వని. బిగ్గఱగా మాటలు 'ఇవ్వాళ్ళ పండగ కాదుటోయ్. కాసేపు హాస్యానికి'.

గబగబా నడిచి వెళుతూన్నప్పటికీ వేంకటేశ్వర్లకు ఆ మాటలు స్పష్టంగానే వినిపించినై. 'ఛస్' అని పళ్ళు పటపటా కొరుక్కున్నాడు. ఇంకా కొంచెందూరం ముందుకెళ్ళేసరికి ... ఇద్దరు పడుచులు... ఎదుటివైపునుంచి నడిచి వస్తున్నారు. ఒకయువతి అంటోంది మరొకావిడతో 'సుమతీ! పండక్కి యీచీరె పెట్టారు మానాన్న గారు.'

'ఛస్. పాడురోద' అని చీకాకుతో గొణుక్కుంటూ నడకవేగం హెచ్చించాడు వెంకటేశ్వర్లు, అతను అట్లా గొణుక్కుంటూ పోవడం ఆ యువతులు గమనించారు. 'పిచ్చివాడు గావాలే' అని నవ్వుకున్నారు.

దారిపొడుగూనా 'పండగ' అన్న మూడక్షరాలూ అతినికి వినిపిస్తూనే వున్నాయి. నూతన వస్త్రాలంకారులగు యువతీయువకులు ఎందరో అతనికి ఎదురవుతూనే వున్నారు. గుండెల్లోని చిచ్చు అతన్ని భస్మీపటలం చేస్తూనేవుంది.

రైల్వేస్టేషన్ కి వెళ్ళాడు. అక్కడా ఇంతే. అణాయిచ్చి టికెట్ తీసుకుని ప్లాట్ ఫారంమీదకు వెళ్ళాడు. అక్కడ కూడా మెరుగేమీ కన్పించలేదు.

అతనికొక మంచి ఆలోచనతట్టింది. దూరంగా కన్పిస్తోన్న ఆ రెల్లుదుబ్బుల్లోకి వెళ్ళి పొద్దూకేవరకూ కూర్చునివస్తే ఏ చికాకూ వుండదనుకున్నాడు. వెంటనే బయల్దేరాడు. రెల్లుదుబ్బులు బాగా ఎత్తుగా పెరిగివున్న ప్రదేశంలో కూర్చున్నాడు. అచటి నిర్మల ప్రశాంత వాతావరణం అతన్ని అమితోత్సాహంతో

నింపుతోంది. కొంచెందూరంగా, సెల్లు దుబ్బులసందుల్లోనుంచి కనిపిస్తోన్న కాలవలోని నీరు, ఆ యిరుకుసందులో చోటులేక పుక్కిరిబిక్కిరివి సుడులు తిరుగుతూ, ఆపుష్పవనానికి వెనకగా జారిపోతోన్న సూర్యభగవానుని కిరణకాంతిచ్ఛాయలను ఆభరణములుగా ధరించి మిలమిలా మెరుస్తో, బ్యాండుమేళమును మించిన మధురధ్వనులు పూరిస్తూ, కాలచక్రంవలె వేగంగా, త్రాచుపామువలెనే వంకర్లు వంకర్లుగా తిరిగి ముందుకు తరలిపోతోంది. గులాబీ సౌరభమును వెదజల్లుతూ 'జంయ్' మనే రొదతో చలిగాలి సెల్లుదుబ్బుల సందుల్లోనుంచి దూసుకుపోతోంది. రక్తవస్త్రధారిణియైన ఆకాశం అప్పుడప్పుడే తనలో నీలిమానికి కొంచెం తావొసగుతోంది. ఆరంగు లాకాశాన్ని అందుకోవాలన్నట్లు పక్షులు ఆరాటంతో అల్లరిచేస్తూ ఎత్తుగా ఎగిరిపోతున్నాయి. ఆకసపురంగులు జలప్రవాహంలో ప్రతిబింబిస్తోన్నాయి.

ఆ ప్రకృతి సౌందర్యాన్ని చూచి ఆనందిస్తోన్న వెంకటేశ్వర్లకు, హఠాత్తుగా శిరముపై పిడుగు వాలినట్లయింది. పైనుంచి ఓ పల్లెపడుచు, ఓ చేత్తో నెత్తిమీది బుట్టను గట్టిగా పట్టుకుని మహా వుత్సాహంగా పాడుకుంటూ ఒస్తోంది :

'సంక్రాంతి పండగ
సంతోషమైన పండగ
బొమ్మలోళ్లు బాగుపడే పండగ
గుడ్డలోళ్లు లాభపడే పండగ
సంక్రాంతి పండగ...'

'అయ్యో! యీగడ్డిదుబ్బుల్లో కూడానా?...' అని అనుకుంటూ నిట్టూర్పు విడిచాడు వెంకటేశ్వర్లు.

# మహావాక్యరత్నాలు

మంచిసంపద ఏదికాని స్నేహితునితో పంచుకోకుండా భోగ్యతరమై వుండదు.

—*Seneca*

* * *

ఒక మనుష్యుడు తన్నుగురించి తాను ఏమనుకుంటాడో అతడు అదే అవుతాడు. మనభావనే మనల్ని దిద్దుతుంది. మన ఆలోచనలే మనము. కాబట్టి బాగా ఆలోచించు.

—*The Rev, E. N, Cotton*

* * *

దేనినైతే తప్పించుకోలేమో దానిని గురించి భయపడడంకాని, విచారించడం కాని కుర్రతనపు బలహీనత అనిపించుకుంటుంది.

—*Shakespeare*

* * *

నీ జీవితాన్ని నీవు నియమబద్ధ మొనర్చుకో. ఆమీద ఆ నియమాలే నీ జీవితాన్ని దిద్దుతాయి.

—*St Benedict*

* * *

ఒక్కొక్క సమయంలో అన్నీ తప్పుదారినే పడతాయని మాత్రమే మనకు తెలుసు. జీవితంలో చెడునే చూద్దామనే తొందరలో మనం ఒక్కొక్క సమయంలో అన్నీ సవ్యంగానూ జరుగుతాయి అనే సంగతిని మరిచిపోతాము.

—*T. B. Priestley*

* * *

మన సందేహాలే మనకు ద్రోహం చేస్తాయి, అవి మనల్ని ఏపని ఆరంభిద్దామన్నా భయపెట్టి మనం సంపాదించగల జయాన్ని మనకు లేకుండా చేస్తాయి.

—*Shakespeare*

* * *

ఓరిమి అనేది విజేతయొక్క ధైర్యసారము. విధినికూడా తట్టుకుని మానవుడు నిలబడగలిగే ఉత్తమగుణ మది.

— *Lytton*

* * *

తప్పులు గడ్డిపరకలలాగున పైనే వుంటాయి. ముత్యాలు వెదుకుదామనుకున్నవారు లోతుకి మునగవలసి వుంటుంది.

—*Dryden*

# ప్రార్థన

ప్రార్థన అనేది ఎవనిచేతగాని కనుగొనబడలేదు. మానవహృదయం యొక్క మొదటి నిట్టూర్పులో, మొదటి దుఃఖంలో, మొదటి సంతోషంలో అది పుట్టువు నొందింది. —*Lamartine*

... ... ...

మనం తరుచుగా అన్నీ ఉడిగాక ఆఖర్ని భగవంతుడి శరణు వేడతాము. అన్యథా శరణంలేదు కాబట్టి అతని శరణు కోరతాము. అప్పుడు మనకు తెలుస్తుంది- జీవితంలో రేగిన తుపాను మనల్ని మనం కోరే స్వర్గానికి కొనిపోయిందని. —*G. Mac Donald*

... ... ...

ఓ, భగవంతుడా ! చెడ్డవారిమీద దయపెట్టు. మంచివారిమీద నీవు ఈవరకే దయపెట్టి వుంచావని నీవు వారిని మంచివారినిగా చేయడంవల్లనే తెలుస్తూవుంది.

—*Old Persian prayer*

# 'మద్రాసీ'

[పూనాలో ఆంధ్రవిద్యార్థులు కొందరు చేసిన చేతకు కథారూపమైన ఈ వృత్తాంతము ఆంధ్రులు శ్రద్ధతో చదవతగివుంది. హిందూదేశంలో వివిధ ప్రాంతాల్లో వుండే ఆంధ్రవిద్యార్థులు ఇట్టి చిల్లరి చేష్టలు చేస్తూ వుండడం అప్పుడప్పుడు వింటూవుంటాము. ఇట్టి చేష్టలు ఆంధ్రకీర్తికి భంగకారులు కాని అన్యం కాదు. ఆసంగతి నొక్కి చెప్పడానికే మేమీ వ్యాసాన్ని ప్రచురిస్తున్నాము. —సంపాదకుడు.]

రచయిత:

## బూర్గుల రంగనాథరావు

౧

...ఒకే ప్రవాహంవలె వుంటుంది జనసమ్మర్దం. ఈ ప్రవాహంలో ముసలాళ్లు వికలాంగులు చిలుమెక్కిన మనుష్యులు వుండరు. అంతా అందమయిన వాళ్లు వయసుపిల్లలు. విద్యార్థులు, విద్యార్థినులు. అందరూ సామాన్యంగా తెల్లగావుంటారు. మగవాళ్లు ట్వీడ్‌కోట్లు వేసుకుంటారు. ఆడవాళ్లు సగంమంది మనమోస్తరే గూడకట్టు చీరలు కడతారు. తక్కిన సగంమంది యేనుగుతొండంలాంటి గోచీలతో బయలుదేర్తారు. లోలక్కులు ఇంకా, కాస్మెటిక్కు అన్నీ వుంటాయి. వీళ్ళలోని ఆమోఘమైన శరీరచ్ఛాయే—కాంతి కాదు—తక్కిన లోపాలన్నింటినీ సవరించివేస్తుంది. హాలీవుడ్ తారల తలదన్నేట్లు కొందరు మరీ విచిత్రంగా తయారవుతారు. బ్రాహ్మణకుటుంబాలకు చెందిన పడుచులుగూడా యిరానీ రెస్టారెంట్లలో ఆమ్లెట్లూ, మటన్, పొలావులూ తింటారు. బీర్ గీర్ కూడా యెక్కిస్తారనుకుంటాను. ఎద్దుల్లాగ అందరినీ రాచుకుంటూ పోవడం, పెద్ద వస్తాదుల్లాగ చూస్తూపోవడం తప్ప చురుకుదనం, చొరవ, కామన్సు వీళ్ళలో మృగ్యం. 'సెక్సు' అంటూవున్నట్టే ఫీల్ అవరు మగవాళ్ళతో బాగానే—అంటే తమ మహారాష్ట్రులతో- కలిసి తిరుగుతారు. అన్ని ఆటల్లో పాల్గొంటారు. మోటారు సైకిళ్లుగూడా యెక్కుతూంటే సైకిళ్లు వీళ్ళకో హాలెఖ్ఖా! అన్నిట్లోనూ మగవాళ్లకంటే వీళ్ళదే పైచేయి. మగవాళ్ళను యేడ్పిస్తారుకూడాను. ఏమన్నా అంటే తంతారుకూడానట. ఎంత ప్రాంతీయ సంకుచితత్వం? యెంతఆత్మస్తుతి, పరనిందః అనుకున్నావ్! చెప్పలేను. పూనాకు దక్షిణంనుండి వచ్చినవాడినల్లా 'మద్రాసీ' అనేసి హేళనచేస్తారు......కాని యీ మహారాష్ట్రులకున్న ప్రాంతీయత, వాళ్ళ స్త్రీలకున్న ధైర్యసాహస బలాలు మన ఆంధ్రులకు, ఆంధ్ర స్త్రీలకు వుంటేనా? నీవు అడిగావు గాబట్టి యీమాత్రమైనా వ్రాశాను. ఓచిన్న ట్రిప్ కొట్టదలచుకుంటే బాగానే వుంటుంది. తచ్చేయ్.'

సుందరం వ్రాసిన యీవుత్తరంలోని వాక్యాలను మళ్ళీమళ్ళీ చదువుకొని, కుటుంబరావు చివరకి పూనా వెళ్లాలని నిశ్చయించుకున్నాడు.

౨

కుటుంబరావు పూనావచ్చి వారం రోజులైంది. ప్రతినిత్యం, సాయంత్రం ఆరుగంటలకు పుట్టి యేడున్నరకు మాయమై తొమ్మిదింటికల్లా యెడారిగా మారే ఆయువ్వనుల ప్రవాహంలో తానూ కొట్టుక పోతూన్నాడు.

వినదినం అక్కడి యువతుల ప్రవర్తన అంతు తెలీకండా వుంది.

కుటుంబం సామాన్యుడుకాడు. ఆంధ్రదేశం అంతటా హడలెత్తించి మద్రాసులోకూడా మంచి రికార్డు స్థాపించిన అథ్‌లెట్. 'ప్రాక్టికల్ రొమాన్సర్'అని పేరుపొందినాడుకూడా. చూడగానే 'బలాఢ్యుడు, చురుకైనవాడు' అని చెప్పవచ్చు. ఆ విశాలమైన పచ్చని వక్షాన్ని,

చిరునవ్వులు చిమ్మే బుగ్గలకు ఆరడుగుల వున్న తాకారాన్ని చూసి అతని క్లాసుమేట్లు అసూయపడేవారు. తనకు తెలియకండానే, తనయిష్టంలేకున్నా తనని వల్లో వేసుకున్న ఒకరిద్దరు అమ్మాయిలు అతనికి సైట్ మేట్సు! ప్రతివాడూ, 'నీలో స్త్రీలనేకాదు పురుషులనుకూడా ఆకర్షించే చార్మ్ వుందిరా' అంటే ఉబ్బిపొయ్యేవాడు.

కాని యీపూల్లో ఆకాంప్లిమెంట్లన్నీ నిరర్థకంగా కనుపడుతున్నాయి. ...ఎన్నాళ్లీ యిట్లా సుందరంగదిలో తండులధ్వంసంచేస్తూ వుంటాడు యే అడ్వెంచరూ లేక ?

సరే చివరికి ఓనాడు ఓవిద్యార్థినిని చూసి ప్రయత్నం ప్రారంభించాడు.

మొదటిరోజు బాగా కళ్లు కలిశాయి.

రెండోరోజు మాపులూ భుజాలూ రాసుకున్నాయి.

మూడోనాడు కనుపడలేదు.

చిరునవ్వులు మాపులను తోడ్పడ్డాయి నాలుగోరోజున.

మరునాడుమాత్రం ఆ అమ్మాయి తమ భాషలో తన స్నేహితురాళ్ళతో యేదో చెప్పి కుటుంబరావును పరిహాసంచేసింది.

కాని తానుకూడా తెలుగులో నాలుగుతిట్లు తిట్టి వాళ్ళకన్నా పెద్దగా నవ్వి పరాభవించాడు. కాని రావును ఆ ప్రతిక్రియతో తృప్తికాలేదు.

3

ఇంకా నాలుగురోజులు గడిచాయి. ఆరోజు సాయంత్రము ఆ అమ్మాయి అద్భుతంగా కనుపడింది. నల్లచీరలోనుంచి ఆమె గులాబీ యవ్వన సౌరభం పొయ్యేవాళ్ళని ఉన్మత్తులను చేస్తోంది. సరిగా భుజంపైకివచ్చి ఆగిపోయిన తెల్లని జాకెటు బ్లౌజులోనుంచి మృదువైన కమ్మని వాసనలనీనే చేతులూ శృంగార కళాన్వితమైన యవ్వనరాసులు యెంత చూడగూడదనుకునే కళ్ళనైనా తమవైపు లాక్కుంటూ వున్నాయి. ప్రతి కదలికలో లావణ్యం, మార్దవం, రసికత ఉట్టిపడుతున్నాయి. పెదవులమీది రక్త రేఖ, హృదయాల్ని చీల్చేసే కళ్లు కుటుంబార్నేకాదు సర్వ ప్రపంచాన్నీ తలక్రిందులు చేస్తోన్నాయి.

'నేడు ఈవేళ తప్పకండా మాట్లాడేస్తాను...నీవు వెనక్కి వెళ్ళిపో' అని వెనకాలే నడుస్తున్న కుటుంబరావు, సుందరంతో చెప్పి, కొంచం జనం తక్కువగా వున్నచోట, ఆమె పక్కనే వెళ్ళి యెంతో పరిచయమున్న వాడికిమల్లే మందహాసంతో, 'హలో' అన్నాడు.

'హల్లో' అంది నవ్వుకు తోడుగా గాంభీర్యం కనబరుస్తూ.

'మీతో నడువవచ్చా కొంతదూరం?'

'నా కెందుకు అభ్యంతరం వుండాలి?'

'ధన్యుణ్ణి' అన్నాడు కుటుంబరావు.

తరువాత పేర్లు-చదివే తరగతులూ మొదలకు అనవసరమైన తప్పనిసరి శుష్కప్రసంగాలు జరిగాయి.

ఆమె పేరు కుసుంభిడే అనీ, సీనియర్ బి.ఏ. చదువుతోందని తెలుసుకున్నాడు. కుసుం వాళ్ళ యిల్లు సమీపించగానే, 'యిక్కడే మాయిల్లు...రండీ:' అంది, కుటుంబరావువైపు చూడకండా కొంటె నవ్వును పెదవులమధ్య నొక్కిపెడుతూ.

'క్షమించండి...కొంచెంపనివుంది... మళ్ళీ ఓమారు దర్శనం చేసుకుంటాను...' అని చెప్పి కుటుంబరావు సుందరంగదికి వచ్చేశాడు.

వచ్చే రావడంతోనే సుందరం టిఫిన్ క్యారియర్లోనుంచి అన్నం వడ్డిస్తూ, 'ఏమేం జరిగింద'ని అడిగినాడు.

'ఆకేయ్!... పిట్ట దొరికిందన్న మాటే?'

'ఆఁ! యెముకలు విరగ్గొట్టించుకునేవ్ ...జాగ్రత్త!'

'ఏడిశావ్!... మొదటినుంచీ చెబుతా విను...కాని చాల స్కాండ్రెల్గా కనుపడుతుందిరా! నాపేరు అడిగింది, నన్నుగురించి అంతా తెలుసుకోవాలని సి.ఐ.డి వలె పరీక్షించింది. నేను బాగా కోశాను...చివరకి తనయింట్లోకి రమ్మందోయ్!'

'వెళ్లావా?'

'వెళ్తానా? వెఱ్ఱివాడినికాను. నాకు వెంటనే తెలిసింది దాని అభిప్రాయం: నన్ను ఫూల్ చేసి తన్నిద్దామని దాని ఆలోచన... నేను సాగనిస్తానా? శాస్తి చేయాలని చూస్తున్నాను. నీవు మాత్రం మనగదిని బాగా డాబుసరిగా అలంకరించి వెయ్యి, ఇంకోహా రహస్యం! నీవోక వేషంవెయ్యాలి ... చెబుతా తర్వాత......'

'నాగదిలో వుంటున్నానని చెప్పావా?'

'లేదు. కాని నా పేరు చెప్పినప్పుడు మద్రాసీవా?' అంది. కాను 'ఆంధ్రులం' అంటే తెలియలేదు. సవిస్తరంగా చెప్పాక కూడా 'అదే మద్రాసీ' అంది. 'సరే మీరల్లాగే పిలువాలనుకుంటే నాకు అభ్యంతరంలేద'ని చెప్పాను.'

౪

మరునాడు యథాప్రకారంగా షికారు వెళ్లుతూండగా 'సయోసంసార్' పిక్చ

రుకు రమ్మని ఆహ్వానించాడు కుటుంబరావు కుసుంని. 'సరే, థియేటరుదగ్గిరే కలుసుకుందామ'ని ఆమె వప్పుకోవడం కుటుంబానికి చాల ఆశ్చర్యం కలిగించింది.

కుటుంబం అనుకున్నంతే అయింది. కుసుంతోపాటు యిద్దరు యువకులూ, యింకో స్నేహితురాలూ వచ్చారు. కుటుంబరావుగూడా తన ప్లాన్ ప్రకారం ఒక తెలుగు పడుచును సినిమాకు వెంటతీసికొచ్చాడు.

అసలు, కుసుంను తాను పిక్చరుకు రమ్మన్నసంగతే మరచినట్టు అతడు ఆమెతో మాట్లాడనేలేదు. చాల కఠినంగా యిగ్నోర్ చేశాడు. కాని ఒకరిజట్టులో యింకోరు పుట్టినట్టు మాత్రం గ్రహించి ఒక్క చూపు చూసుకున్నారు. నిశ్శబ్దంగా అంతా వెళ్ళి లోపల కూచున్నారు.

కుటుంబం, అతని క్రొత్త స్నేహితురాలు తియ్యని తెలుగులో, ఇంగ్లీషు వారికన్న మధురంగా యింగ్లీషులో మహా ఉల్లాసంగా మాట్లాడుకుంటున్నారు. రాజకీయాలు, ఆర్టు, సినిమాగురించి, కుటుంబరావు అతని చేతిలో వొదిగివున్న ఆ అమ్మాయి, అత్యద్భుతంగా తెలివిగా మాట్లాడుకొంటూవుంటే కుసుం ఆమె స్నేహితులూ దంగైపోయారు. తమజ్ఞానానికి తామే సిగ్గుపడ్డారు. కుటుంబం కన్న ఆ కొత్తవ్యక్తే తన సభ్యత, వైదుష్యం అంతా వుట్టిపడేట్లు మాట్లాడుతూవుండగా, చీకట్లోనే కనిపెడుతూన్న కుసుంకు భరించడం కష్టంగా తోచింది.

ఒకవిధమైన కోంటెతనంతో కుటుంబానికి బుద్ధి చెప్పాదామనుకున్న కుసుంను స్త్రీ సహజమైన ఈర్ష్యపీక్కుతింటోంది. ఆ ఉద్దేశ్యాలన్నింటికీ స్వస్తి చెప్పి ఆతన్ని యేమీ అనవద్దని తన స్నేహితులకు చెప్పింది. కాని తనతో మాట్లాడకండా అతడు యింకో స్త్రీ ప్రక్కన అలా వుండడం సహించక ఆలోచిస్తూ కూచుంది పిక్చరు చూడకండా.

అలంకారంలోనేమి, చొరవలోనేమి, ఫ్యాషన్ లోనేమి తనకన్నా మిన్న అయిన ఆ కొత్త అమ్మాయి, తన్ను స్కూల్ చేయ దలుచుకున్న యువకుణ్ణి ప్రేమకు దాసియై అతన్ని పూజించడం కుసుంకు ఆశ్చర్యం కలిగించింది. ఇదివరకే తానే కుటుంబరావును వశపరచుకోనందుకు పశ్చాత్తాప పడింది...

కాని వెంటనే మహారాష్ట్రగర్వం, ప్రాంతీయత ఈ'మద్రాసీ'లను క్షమించలేదు. 'వనవిహంగాలవలె యెలా హాయిగావున్నారు! ఎంత మధురంగా ఎంత నవనీత మృదులంగా వున్నాయి ఆ యింగ్లీషు తెలుగు కలిసినమాటలు. ఏం చక్కానవుతుంది! ఎంత ఆనంద మిస్తున్నది తన ప్రియుడికి మనములా యింగ్లీషు మాట్లాడమేం? మనమహారాష్ట్రంకూడా యిట్లా మాట్లాడమే! ఇంత రసికత్వంతో ఏయువకుడితోనైనా ఒక నిముషమైనా గడిపానా! ప్చ్...ఛ! ఏమిటిది? ఇలా అనుకుంటున్నాను! మహారాష్ట్రజాతిని మహారాష్ట్రస్త్రీనా మహారాష్ట్రభావనా నేను కించపరుస్తున్నది? మూర్ఖం! కిందపడినా పైకాలు నాదే అనే పట్టుదలవుండాలి...అయినా యిదేమిటి కుటుంబరావుతో యింతపరిచయం, చనువు? నాకెందుకూ వాడెట్లాపోతే? మనసు అతడంటే యెందుకలా గింజాలాడుతుంది?...ప్రేమిస్తున్నానా? నాకు తెలీకండానే ప్రేమిస్తున్నానా? ఛ! 'మద్రాసీ'ని ప్రేమించడమేమిటి? అయితేమాత్రం?...యేమో అంతా అయోమయంగావుంది. ఏమైనా కుటుంబరావును పోగొట్టుకోగూడదు. అతని కామానికీ లొంగకూడదు. అతన్ని ఆమెనుండి విడదీశేశక్తి, ఆకర్షణ నేనుసంపాదించుకోవాలి'ఇలాంటి ఊహాపరంపరలు ఆమె తల్లో తిరిగిపోయాయి.

పిక్చరయిపోయింది.

ఏపార్టీకి ఆపార్టీ నిశ్శబ్దంగా యిల్లు చేరుకుంది.

మరునాడు 'వాక్'కు పోతూవుంటే కుసుం కుటుంబరావులు కలుసుకున్నారు. ఇద్దరు నిర్మొహమాటంగా గంభీరంగా మాట్లాడుకుంటున్నారు.

కుసుం తన మనసులోని భావాలు పైకి తెలిసీకండా.

'రాత్రి మేమూ పిక్చరుకి వచ్చాము' అంది.

'అవును మేము చూశాము. క్షమించండి...మీరంతావున్నారు కాబట్టి...'

'నేనూ అంచేతే మీతో మాట్లాడలేదు...ఆమె...'

'ఆమె పేరు విమల. నాగదిలోనే వుంటుంది. మాబంధువు. ఓ.చిన్న ట్రిప్ తీసుకుంది పూనాకు.'

'మీ వెంట షికారుకు రాదే రోజూ?'

'మా స్నేహితుడి వెంట టెన్నిస్ కు వెళ్తూంటుంది.' కుసుం కొంచంసేపు మౌనంవహిస్తుంది.

'మీకేంభయం? మా మద్రాసీలవలె మీకు భయంగావుందా వంటిగా వెళ్ళడం?'

'అబ్బే భయమెందుకూ? పదండి' అంటూ మొహం సవరించుకొని తడ

బహుతూ వప్పుకుంది కుసుం. యిద్దరూ కలిసి సుందరంగదికి వచ్చేశారు.

ఆకర్షణీయంగావుంది. కళాకారులూ అందమైన ఉత్తమజాతి స్త్రీలు వుంటే గదివలె తయారయింది. కుసుం గదిలోకి రాగానే కుటుంబరావు, విమల సంపన్న గృహస్థులు అత్యున్నతమైన సభ్యత కల వారు అని తెలిసికొంది. ఎదురుగావున్న సోఫాలో కూర్చుని, 'విమల' అని సంతకంచేసివున్న కొన్ని చిత్రాలను చూస్తూ!

'విమల గొప్ప ఆర్టిస్టే!... నిజంగా మీరు నన్ను అవమానపరిచారు, ఆమెతో పరిచయం కలిగించక' అంది.

'అం! ఏం ఆర్టిస్టండీ! యేదో ఉబుసుపోకకు గీసింది... నాకుమాత్రం మీలాగ బాగా శరీరబలంవుండి పోట్లాడే శక్తికలిగివున్నవాళ్ళంటేనే యిష్టం. మగరూపుఅవుతే యింకాయిష్టం!'

'వేళాకోళం చేస్తున్నారు... యింకా విమల రాలేదే!'

'మనయిద్దరం వున్నప్పుడు మీకు ఆమె చింత యెందుకూ?' అని కుటుంబం అంటే 'ఏం' అన్నట్టు ఆమె చూసింది.

దానికి 'మల్లెపూలముందర చీపురుపుల్ల ప్రశంసవలె వుంటుంది!' అన్నాడు...

'మీరు కవులా యేం?'

'ఈముక్కలోనే నాకవిత్వం కనుపడిందా?'

'లేదు మీ మొహమ్మీదే ఆమాట రాసి వుంది.'

'ఆహాఁ! ... కవిని పెళ్లాడుతారా? కుసుం' అని ప్రారంభించాడు కుటుంబరావు.

'మద్రాసీలనే—సారీ! అలా అంటే మీకు కోపంకదూ! — ఆంధ్రులన్నే! అన్నంతినేవాళ్ళనే' అని భుజాలు కదిలించి నోరుతెరచి వెకిలినవ్వు నవ్వింది కుసుం.

ఇహ వ్యవహారం పరిష్కారం చేయాలని, ఆమె నవ్వులోని లాలిత్యాన్ని-కాఠిన్యాన్ని భరించలేక, ఆమెనుగట్టిగా అదుముకున్నాడు.

తన శీలానికీ తనకూ తనవాళ్ళకూ అవమానం కలిగిందనీ, తను పరాభవింపబడుతున్నదనీ లేనికోపం తెచ్చుకొని. తన శరీంలో ఆకలికొన్న నరాలు యెంత 'వద్ద'ని మొత్తుకుంటున్నావినక కుటుంబరావు చెంపమీద కొట్టింది.

దీనికి సిద్ధంగా నేవున్న కుటుంబరావు ప్రత్యుత్తరంగా చక్కటి యీడ్చివేసి కళ్ళనుంచి తోసివేసి, 'వెళ్లు అవతలకి పో! నీవు అగచి లాభంలేదు. నీవై నీవు నాగదిలోకివచ్చినట్టు సాక్ష్యం నామిత్రుడు అవతలవున్నాడు. లాభంలేదు కేసుపెట్టినా కూడా... నిన్ను చెరచే ఉద్దేశంతో తీసుకరాలేదు. మద్రాసీ సంగతి చూపిద్దామని తెచ్చాను. మద్రాసీ యిట్లా యెప్పుడూ చేయడు ... ఈవిషయం యెవరితోనూ చెప్పకొను. నేనూ చెప్పనులే... కాని ఆంధ్రులకుకూడా ఆత్మగౌరవం వుందని గ్రహించుకో' అని ఒక్క గుక్కలో అనేసి బయటికి తరిమాడు.

కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ కుసుం వెళ్ళిపోయింది.

రెండురోజులింకా వుండి తనువచ్చిన పని అయినట్టు, సుందరంతో శలవు తీసుకొని యింటికి వచ్చేశాడుకుటుంబం.

కాని యింతకూ, విమలపాత్ర ధరించింది సుందరమేనని కుసుంకు తెలియనే లేదు పాపం.



Printed at the Andhrabhumi Printing Works, 13 Mukhatal Street. Vepery P.O, Madras.
Editor & Publisher : Andra Seshagiri Rao B.A.

## ఆంధ్రరమణీమణులు భా-౧

ఇందు—కాకతీయాంధ్రసామ్రాజ్యసింహాసన మధిరోహించి జనరంజకముగ, శత్రుభయంకరముగ రాజ్య మేలిన రుద్రమ్మ; ధరణికోట సింగపుపీఠి నెక్కి అసామాన్యముగ రాజ్యచక్రము త్రిప్పిన గణపమ్మ; ఆంధ్రదేశమున అడుదిగా పుట్టిన మంత్రిరాక్షసుని అపరావతారముగా నాయకురాలను బిరుదుగాంచిన పలనాటి నాగమ్మ; కాగిలిలోనున్న భర్తను దీవించి కరవాల మొసగి కదనరంగమునకంపిన మాంచాల; ప్రజారంజకముగ పెద్దాపుర సంస్థానమును పాలించి తురక ఫౌజుదారుని బారి పడకుండ జోహారొనర్చిన అభిమానస్వరూప రాగమ్మ; ఆమె చేతులనుండి ఆమె మనుమని ఏడు మాసముల కసుగందుని గ్రహించి పంచకర్పూరములపడి అతని రక్షించిన స్వామిభక్తిపరాయణ మహాలక్ష్మమ్మ; పతియగు కామజుని పతితో సహగమన మొనర్చుచు పతి విరోధియగు ఆనందరాజునకు తిరుగని శాపమిచ్చిన మహాపతివ్రతాతిలకము సీతమ్మ; రాణివాసపు శ్రీలనెల్ల కాలదన్ని భాను కత్తి కెరయైన మానమెరిగిన స్త్రీరత్నమునకు మొదటి పేరైన బొబ్బిలిరాణి మల్లమ్మ; నిండుమాలాలయ్యు మానసంరక్షణార్థమై నిజప్రాణముల ఖడ్గమున కెరచేసిన రమణమ్మ — వీరలఅద్భుతచరితలు ఆంధ్రాభిమానముతో ప్రస్తరింపబడినవి.

2-వ కూర్పు. 112 పుటలు. దళసరి కాగితములు,
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

## ఆంధ్రరమణీమణులు భా-౨

ఇందు—రణరంగమున వీరవిహారము విరమించి యింటికి వచ్చిన పతికి వీరసందేశమిచ్చి తిరిగి కదనభూమికి పంపి అతనికి వీరస్వర్గమిప్పించిన ఆంధ్ర వీరపత్ని చానమ్మ- మానముకొఱకు, మాటవాసికొఱకు తన్ను తాను పొడుచుకొని చనిపోయిన తంజావూరి తెనుగురాణి రాజగోపాలమ్మ- యీ రాజగోపాలమ్మ మనుమని వెంకమలదాసుని విక్రాంతి సమయమున అరసి రక్షించి తన ప్రభుభక్తిని ప్రకటించిన దాది - మధుర ఆంధ్రనాయక రాజ్యపాలనమును మహనీయముగ సాగించిన దానవిరతిని, ఆంధ్రభాషాభిమానమును అతిశయముగ ప్రదర్శించిన మంగమ్మ- వాంనాసాహేబు మోసమునకు గురియైన మీనాక్షి- పథ్యమునుమట్టని పచ్చి బాలెంతరాలయ్యు తన సహగమనోద్యోగము నెవ్వరకపోగా పన్నీరుత్రాగి ప్రాణములు విడిచిన పతివ్రతా మూర్తిమ్మ ప్రజోపయోగమునకై శిశుసహితముగ బలిపోయిన సంగమ్మ వీరల పవిత్రచరిత్రలు కలవు.

దళసరి కాగితములు. 100 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

## కేయూరబాహుచరిత్ర

[illegible] మంచనకవి [illegible] రచియించిన కేయూరబాహుచరిత్ర మను సంస్కృతకావ్యమును ఆధారముగ జేసికొని యీ తెనుగు వచనము బాలబాలికలకొఱకు వ్రాయబడినది. మొదట దీనవానిని సార్వభౌమునిగా జేయు తరమునకొంచెవ్వ ... కేయూరబాహుడను రాజునకు పతిని ధర్మపత్నిచే భోగరాయణుడను నాతని మంత్రి నిజబుద్ధిబలమున వివాహము చేయించిన వృత్తాంతమిందలి ప్రధానకథ. నడుమ నడుమ చక్కని నీతికథలు పెక్కులు గలవు.

గ్లేజు కాగితములు. 90 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.

## ఆంధ్రరాజభక్తులు

రాజభక్తి యనునది దేశభక్తికి పర్యాయపదముగా గణింపబడుచుండిన ఆంధ్రదేశపు స్వతంత్రయుగ చరిత్రలలో కాంతించు రాజభక్తశిఖామణులను విశ్వనాథనాయుడు, యాచమనాయుడు, అబ్దుర్‌రజాక్‌లారీ, కంబసవస్వామి, తిమ్మన మంత్రి, మహాలక్ష్మమ్మ, పాపానాయుడు, హనుమప్ప నాయుడు అను ఎనమండుగురి చరిత్రలను కీర్తించు గ్రంథము.

గ్లేజు కాగితములు. 112 పుటలు.
పోస్టుఖర్చులు ప్రత్యేకము. ప్రతి 1-కి అ 8.